# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com


**నేటి కందం- నేటికి అందం**

ఘనతరమగు యొప్పందము
లను జేసుకొనంగ విదుడు రయమున వచ్చెన్
కెనడా ప్రధాని క్యార్నీ
మన భారత దేశమునకు మన్నన నిడుచున్ !!

(ఎన్నో రంగాలలో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందాలు చేసుకోవడం కొరకు మోడీ మీద గౌరవంతో కెనడా ప్రధాని క్యార్నీ మన భారత దేశానికి వచ్చారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

న్యాయంలో అవనీతి
నేడు పెడితే పార్యాంశం
ప్రణాళిక బద్ధంగా
పరువుదీసే సారాంశం
విద్యార్థుల మనసుల్లో
విషం పోసే లక్ష్యశుద్ధి
సర్కారుకు తెలువకుండా
సాగుతుందా వక్రబుద్ధి



-వేల్పుల నారాయణ
9440433475


హైదరాబాద్ శుక్రవారం 27-2-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:165 పేజీలు:6 వెల: రూ.1/-


# ఇకపై ఇజ్రాయెల్‌లోనూ యూపీఐ సేవలు : ప్రధాని మోదీ



న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 26: భారత్ - ఇజ్రాయెల్ మధ్య సంబంధాలు ప్రతి సవాల్‌ను తట్టుకుని కాలపరీక్షకు నిలిచాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పరస్పర విశ్వాసం, ప్రజాస్వామ్య విలువలపై ఏర్పడిన ఈ బంధం ఎంతో బలమైనదని పేర్కొన్నారు. ఇరు దేశాల భాగస్వామ్యాన్ని 'శాంతి, ఆవిష్కరణ, శ్రేయస్సు కోసం ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి పెంచుతూ చారిత్రక నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు.

జెరూసలేంలో గురువారం ఇజ్రాయెల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహుతో కలిసి నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడారు. అంతకుముందు ఇరుదేశాల మధ్య పలు కీలక అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) జరిగాయి. కృత్రిమ మేథ , క్వాంటం, క్రిటికల్ మినరల్స్ వంటి రంగాల్లో సహకారాన్ని వేగవంతం చేసేందుకు 'క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీ పార్ట్‌నర్‌షిప్' ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇజ్రాయెల్‌లో యూపీఐ సేవలను వినియోగించేందుకు ఒప్పందం కుదరడం సంతోషంగా ఉందన్నారు.

వ్యవసాయ రంగంలో సహకారానికి సుదీర్ఘ చరిత్ర ఉందని, దీన్ని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని నిర్ణయించామని ప్రధాని చెప్పారు. ఇజ్రాయెల్ సహకారంతో భారత్‌లో ఏర్పాటు చేసిన సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ విజయవంతం కావడంతో వాటి సంఖ్యను 100కు పెంచనున్నట్లు వెల్లడించారు. త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి తుదిరూపు ఇస్తామని పేర్కొన్నారు.

ఉగ్రవాదంపై ఇరుదేశాల వైఖరి స్పష్టంగా ఉందని, దానికి ప్రపంచంలో చోటులేదని మోదీ స్పష్టంచేశారు. గాజా శాంతి ప్రణాళిక ద్వారా శాంతికి మార్గం ఏర్పడిందని, ఈ ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతు ఇచ్చిందని పునరుద్ఘాటించారు. తొమ్మిదేళ్ల తర్వాత మళ్లీ ఇజ్రాయెల్ చారిత్రక గడ్డపై అడుగుపెట్టడం గర్వంగా, భావోద్వేగంగా ఉందని మోదీ అన్నారు.

ఇజ్రాయెల్ పార్లమెంట్ 'క్నెస్సెట్'లో ప్రసంగించే అవకాశం కల్పించినందుకు, స్పీకర్ మెడల్‌తో సత్కరించినందుకు ఆ దేశ ప్రధాని నెతన్యాహుకు, ఇజ్రాయెల్ ప్రజలకు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన చిన్నదే అయినప్పటికీ, అది అసాధారణంగా ఫలవంతమైందని, హృదయాలను కదిలించిందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అన్నారు. గురువారం జెరూసలేంలో ఇద్దరి మధ్య చర్చల అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

'ఇది ఒక అద్భుతమైన పర్యటన. పర్యటన ముగింపు కూడా అంతే అద్భుతంగా ఉంది. నిన్న ఇజ్రాయెల్ పార్లమెంట్ 'క్నెస్సెట్'లో మోదీ చేసిన ప్రసంగం అందరి కళ్లను చెమర్చేలా చేసింది' అని నెతన్యాహు ప్రశంసించారు. ఇరు దేశాల్లోని ప్రతిభావంతుల మధ్య సహకారం గురించి చర్చించామని, వాటిని నిర్దిష్ట ప్రణాళికలుగా మారుస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా భారత్‌లో ప్రభుత్వ స్థాయి సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన ప్రకటించారు. ఇది ఇరుదేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

మోదీ నాయకత్వంలోని భారత ప్రభుత్వం చాలా సమర్థవంతంగా పనిచేస్తోందని నెతన్యాహు కితాబిచ్చారు. 'ఆవిష్కరణలను అందిపుచ్చుకున్న వారికే భవిష్యత్తు ఉంటుంది. భారత్, ఇజ్రాయెల్ గర్వించదగిన ప్రాచీన నాగరికతలు భవిష్యత్తును అందిపుచ్చుకోవడానికి వేం నిశ్చయించుకున్నాం. కలిసికట్టుగా మరింత అభివృద్ధి సాధించగలం' అని అన్నారు. ప్రెసిషన్ అగ్రికల్చర్, ప్రెసిషన్ ఎడ్యుకేషన్ వంటి రంగాల్లో కలిసి పనిచేయడం ద్వారా ప్రతి ఒక్కరి సామర్థ్యాన్ని వెలికితీయవచ్చని అభిప్రాయపడ్డారు.

# ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంలో రాజీ పడొద్దు: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 26:కోర్ అర్బన్ రీజియన్‌లో ప్రభుత్వ స్కూల్స్‌లో మౌలిక సదుపాయాల కల్పనపైన దృష్టి సారించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. భారతీయ విద్యా భవన్, జూబ్లీ హిల్స్ పబ్లిక్ స్కూళ్లల్లో ఉన్న మౌలిక సదుపాయాలు ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఉండాలని సూచించారు. ఇవాళ (గురువారం) ఐసీసీసీలో ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌పైన సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశానికి సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణా రెడ్డి , విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా , కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కుమార్, అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి హాజరయ్యారు.

### బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌ను పకడ్బందీగా అమలు చేయాలి..

ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని మార్గనిర్దేశం చేశారు. బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌లో తప్పనిసరిగా పాలు అందజేయాలని నిర్దేశించారు. ఇందుకోసం విజయా డైరీ నుంచి పాలు సేకరించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత కోసం ఏఐ టెక్నాలజీని వినియోగించాలని దిశానిర్దేశం చేశారు. కోర్ అర్బన్ రీజియన్ మినహా మిగిలిన నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఒక్కొక్క మండలంలో ఆరుట్ల స్కూల్ తరహాలో ట్రాన్స్‌పోర్ట్‌తో సహా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

### ఎలక్ట్రికల్ బస్సులపై అధ్యాయనం చేయాలి..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ట్రాన్స్‌పోర్ట్ కోసం



ఎలక్ట్రికల్ బస్సుల ఏర్పాటు పైన అధ్యాయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రైవేట్ స్కూల్స్‌లో నిబంధనలకు మించి ఫీజులు వసూలు చేస్తే అనుమతి రద్దుతో పాటు రికవరీ చేసేలా నిబంధన విధించాలని హుకుం జారీ చేశారు. ప్రైవేట్ స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణకు సంబంధించి రికమండేషన్స్‌ని ప్రజాభిప్రాయం కోసం వెబ్‌సైట్‌లో ఉంచాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అలాగే, ఎంసీహెచ్‌ఆర్‌డీలో గ్రూప్- 2, 3 ఆఫీసర్ల శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు.

# భారీ అగ్ని ప్రమాదం...ఎగసిపడిన మంటలు





హైదరాబాద్, ఫిబ్రవరి 26:నగరంలోని జూబ్లీహిల్స్ రోడ్ నెం.36లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మంగళగౌరి షాపింగ్ మాల్‌లో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది.. ఘటనా స్థలికి చేరుకుని మంటలార్పుతున్నారు. మూడు ఫైర్ ఇంజన్ల సాయంతో మంటలను అదుపు చేస్తున్నారు. షాపింగ్ మాల్‌లో ఉన్న వస్త్రాలు, ఫర్నిచర్ పూర్తిగా దగ్ధమయ్యాయి.

షాపింగ్ మాల్‌లో వెల్డింగ్ పనులు చేస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో షాపింగ్ మాల్‌లో నలుగురు వ్యక్తులు ఉండగా.. వారు ప్రాణాలతో సురక్షితంగా బయటపడ్డారు. ఈ అగ్ని ప్రమాదం కారణంగా జూబ్లీ హిల్స్ రోడ్ నంబర్ 36 ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

ఈ ప్రమాదంలో మొదటి నాలుగు అంతస్తులు పూర్తిగా దగ్ధమ్యయాయి. ఒక సిలిండర్ బ్లాస్ట్ కావడంతో ప్రమాద తీవ్రత మరింత పెరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మొదటి మూడు అంతస్తుల్లో ఉన్న వస్త్రాలు, ఇతర సామగ్రి కాలి బూడిదయ్యాయి. ఇంక ఎవరైనా చిక్కుకుని ఉంటారనే అనుమానంతో ముందుగా అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచారు. దట్టమైన పొగలు రావడంతో లోపలికి వెళ్లేందుకు ఫైర్ సిబ్బంది కాస్త ఇబ్బంది పడ్డారు. పోలీసులతో పాటు హైడ్రా అధికారులు ఘటనా స్థలికి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు.

# ఖర్గేని కలిసిన జగ్గారెడ్డి..

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 26:ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఇవాళ(గురువారం) ఢిల్లీలో కలిశారు. ఖర్గేతో ఆయన పలు కీలక అంశాలపై చర్చించారు. తెలంగాణలో ఖాళీ కానున్న రెండు రాజ్యసభ స్థానాలపై సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్, ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌తో కూడా ఈ విషయంపై మాట్లాడానని, వి. హనుమంతరావు, జెట్టి కుసుమ కుమార్‌లకి రాజ్యసభ ఇవ్వాలని కోరానని అన్నారు.

ఇదే విషయంపై రాహుల్ గాంధీని, మల్లికార్జున్ ఖర్గేని కలవడానికి ఢిల్లీకి వచ్చానని తెలిపారు. రాహుల్ గాంధీ ముందస్తు షెడ్యూల్ కారణంగా ఆయన బిజీగా ఉన్నారని చెప్పుకొచ్చారు. వి. హనుమంతరావు. జెట్టి కుసుమ కుమార్‌లకు రాజ్యసభ అవకాశాలపై ఆలోచన చేయాలని కోరానని తెలిపారు. జెట్టి కుసుమ కుమార్.. యూత్ కాంగ్రెస్ లీడర్‌గా, స్టూడెంట్ లీడర్‌గా.. కమ్మ సామాజిక వర్గం నుంచి ఉన్నారని ప్రస్తావించారు. జెట్టి కుసుమ కుమార్ ఫ్యామిలీ ఫ్రీడమ్ ఫైటర్స్ అని, వాళ్ల కుటుంబం నుంచి అంతా కాంగ్రెస్‌లోనే ఉన్నారని గుర్తుచేశారు.

హనుమంతరావు తెలంగాణలో అనేక మంది ముఖ్యమంత్రులతో పని చేశారని వెల్లడించారు. మూడు సార్లు రాజ్యసభ ఎంపీగా పని చేశారని చెప్పుకొచ్చారు. ఆయనకు రాజీవ్ గాంధీ , సోనియాగాంధీ అవకాశాలు ఇచ్చారని తెలిపారు. వి.హనుమంతరావు చురుకైన వ్యక్తి అని, ఆయనకు మరోసారి రాజ్యసభకు అవకాశం ఇవ్వాలని ఖర్గేను కోరానని అన్నారు. కమిటీలో చర్చిస్తామని ఖర్గే హామీ ఇచ్చారని తెలిపారు. రాహుల్ గాంధీ నిర్ణయం మేరకు ముందుకు వెళ్తామని జగ్గారెడ్డి పేర్కొన్నారు.


# బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్.. భద్రతాబలగాల కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి

ఛత్తీస్‌గఢ్, ఫిబ్రవరి 26: ఛత్తీస్‌గఢ్ లోని బీజాపూర్ జిల్లాలో నక్సలైట్లు , భద్రతాబలగాలకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి.

ఈ కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు.

ఇంద్రావతి నదీ తీరంలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు దాగి ఉన్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. గాలింపులు చేపడుతుండగా తారసపడిన మా వోయిస్టులు కాల్పులు జరుపడంతో పోలీసులు ఎదురుకాల్పులు జరిపారు. తమ ప్రతిదాడిలో వారు మృతిచెందారని తెలిపారు.

# అమెరికా, ఇరాన్ మధ్య మూడో దఫా చర్చలు



న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 26: ఇరాన్ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు జెనీవాలో పరోక్ష చర్చలు జరుగుతున్నాయి. అమెరికా, ఇరాన్ అధికారులు ఆ మీటింగ్‌లో పాల్గొంటున్నారు. ఒకవేళ న్యూక్లియర్ డీల్‌పై తుది నిర్ణయం వెలుబడకుంటే, అప్పుడు ఇరాన్‌పై దాడి చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జెనీవాలో అమెరికా, ఇరాన్ అధికారుల మధ్య మూడో దఫా చర్చలు జరుగుతున్నాయి. కొన్నాళ్ల నుంచి మిడిల్ ఈస్ట్‌లో అమెరికా తన సైన్యాన్ని మోహరిస్తున్న విషయం తెలిసిందే. 2003లో చేపట్టిన ఇరాక్ ఆపరేషన్ తర్వాత భారీ స్థాయిలో అమెరికా దళాలు మిడిల్ ఈస్ట్ చేరుకుంటున్నాయి. ఒకవేళ అమెరికా దాడి చేస్తే, దాన్ని తిప్పికొట్టేందుకు తాము కూడా సిద్ధంగా ఉన్నట్లు ఇరాన్ చెబుతోంది. ఒమన్ విదేశాంగ మంత్రి బదర్ అల్‌బుసైది నేతృత్వంలో చర్చలు జరుగుతున్నాయి. అణ్వాయుధం అంశంలో ఇరు దేశాల మధ్య అగ్రిమెంట్ కుదరడం అనుమానంగా తోస్తోంది. ఇరాన్ సమస్యను పరిష్కరించేందుకు దౌత్యాన్ని ప్రిఫర్ చేస్తానని ట్రంప్ చెప్పినా.. ఆ వత్తిడి తెచ్చేందుకు స్వల్ప స్థాయిలో దాడులు జరపనున్నట్లు కూడా ఆయన వెల్లడించారు.

# రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థిని దుర్మరణం..మరొకరికి గాయాలు

అమరావతి, ఫిబ్రవరి 26:ఏపీలోని బాపట్ల జిల్లా చీరాల వద్ద జరిగిన బీటెక్ విద్యార్థి మృతి చెందారు. విజయనగర్ కాలనీ వద్ద హైవేపై ఆగి ఉన్న లారీని స్కూటీ ఢీ కొట్టింది. దీంతో స్కూటీపై ఉన్న బీటెక్ విద్యార్థిని సహస్ర(20) మృతి చెందగా మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి . గాయపడిన యువకుడిని గుంటూరు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. హైదరాబాద్ వాసి అయిన సహస్ర గుంటూరులోని ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతుంది .

# మార్చి 3న చంద్రగ్రహణం.. టీటీడీ అన్నప్రసాద వితరణ కేంద్రాల మూసివేత

తిరుపతి, ఫిబ్రవరి 26: మార్చి 3వ తేదీన చంద్రగ్రహణం సందర్భంగా తిరుపతి, తిరుచానూరులోని టీటీడీ ఆధ్వర్యంలోని అన్నప్రసాద వితరణ కేంద్రాలను మూసివేయనున్నట్లు అధికారులు వివరించారు.

తిరుచానూరులోని తోళ్లప్ప గార్డెన్స్‌లో గల ఎస్వీ నిత్య అన్నప్రసాద భవనం, తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలోని ఉద్యోగుల క్యాంటీన్, పద్మావతి విశ్రాంతి భవనంలోని క్యాంటీన్, శ్రీనివాసం, విష్ణునివాసం వసతి సముదాయాల్లో భక్తులకు అందించే ఉచిత అన్నప్రసాద వితరణను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు ప్రకటించారు.

తిరుపతిలోని ప్రభుత్వ వైద్యశాలలు , వివిధ ప్రథమ చికిత్స కేంద్రాల్లో రోగులు , వారి సంరక్షకులకు అందించే అన్నప్రసాదాలను ముందస్తుగా పంపిణీ చేస్తామన్నారు.

# యజమాని ఇంటిపై.. నకిలీ ఈడీ రైడ్ చేయించిన పనిమనిషి




న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 26:ఇంటి యజమాని డబ్బు, నగలపై పనిమనిషికి కన్నుపడింది. బంధువైన మహిళతో కలిసి కుట్రపన్నింది. వదిన భర్త, అతడి స్నేహితుడితో కలిసి నకిలీ ఈడీ రైడ్ చేయించింది. దర్యాప్తు చేసిన పోలీసులు అసలు గుట్టును రట్టు చేశారు. (ఈజీనివ ఇఆ ఖీజీతిట) దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. ఫిబ్రవరి 11న న్యూ ఫ్రెండ్స్ కాలనీలో నివసించే ఆర్పీ సభర్వాల్, ఉషా దంపతుల ఇంటిపై నకిలీ ఈడీ రైడ్ జరిగింది. ముగ్గురు వ్యక్తులు ఈడీ అధికారుల పేరుతో ఆ ఇంట్లో సోదాలు చేశారు. ఆ దంపతులు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. బీరువాల నుంచి నగదు, నగలను, ఖరీదైన వాచీలను బయటకు తీయించారు.

కాగా, ఉషా వద్ద మరో మొబైల్ ఫోన్ ఉన్నది. టాయిలెట్‌లోకి వెళ్లిన ఆమె, ఈడీ తరుఫున న్యాయవాదిగా పని చేస్తున్న మనవడైన గౌరవ్‌కు ఫోన్ చేసింది. ఇంట్లో జరిగిన రైడ్ గురించి చెప్పింది. ఆరా తీసిన అతడు నకిలీ రైడ్ అని అనుమానం వ్యక్తం చేశాడు. ఈ నేపథ్యంలో ఈడీ తరుఫు న్యాయవాది అయిన తన మనవడు వచ్చి మాట్లాడతాడని ఆ వ్యక్తులకు ఆమె చెప్పింది. భయపడిన ఆ ముగ్గురు సుమారు 4 లక్షల డబ్బు, బంగారు ఆభరణాలు, ఏడు ఖరీదైన వాచీలతో పారిపోయారు.

మరోవైపు ఫిర్యాదు అందుకున్న పోలీసులు ఈ సంఘటనపై దర్యాప్తు చేశారు. 300కు పైగా సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించారు. నకిలీ ఈడీ రైడ్ కోసం నిందితులు వినియోగించిన కారును ఘజియాబాద్‌లోని ఒక ఇంట్లో గుర్తించారు. పూజా రాజ్‌పుత్ అనే మహిళను ప్రశ్నించారు. ఆర్పీ సభర్వాల్ ఇంట్లో రెండేళ్లుగా పని చేస్తున్న రేఖ దేవి ఈ కుట్ర పన్నినట్లు తెలుసుకున్నారు. రైడ్ సమయంలో ఆ ఇంట్లో ఉన్న ఆమె వారి ఆస్తుల గురించి సమాచారం ఇచ్చినట్లు బయటపడింది.

అయితే పారామిలిటరీ దళంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పూజ భర్త మనీష్, అతడి స్నేహితుడు ఉపదేశ్, ఫ్రెండ్ కుమారుడు కలిసి నకిలీ ఈడీ రైడ్‌కు పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ నేపథ్యంలో కుట్ర పన్నిన పనిమనిసి రేఖ దేవి, ఆమె వదిన పూజను పోలీసులు అరెస్ట్ చేశారు.

# భార్య ప్రియుడ్ని కాల్చి చంపిన వ్యక్తి.. బీడీ వెలిగించిన తర్వాత పోలీసులకు లొంగుబాటు

లక్నో: భార్య ప్రియుడ్ని ఒక వ్యక్తి కాల్చి చంపాడు. పారిపోయిన అతడ్ని పోలీసులు చుట్టుముట్టారు. ఈ నేపథ్యంలో బీడీ వెలిగించిన తర్వాత అతడు లొంగిపోయాడు. దీనికి ముందు భార్యను కూడా చంపుతానని ఒక వీడియోలో హెచ్చరించాడు. (ఎజీని నెతిశ్రీశ్రీబ లితిటవ'బ శ్రీనీలవతీ) ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ఈ సంఘటన జరిగింది. బుధవారం మధ్యాహ్నం మీరట్‌లోని రద్దీ మార్కెట్ ప్రాంతమైన రామ్‌రాజ్‌లో బైక్‌పై వెళ్తున్న 28 ఏళ్ల సురేంద్ర అలియాస్ సునీల్‌పై ముసుగు వేసుకున్న వ్యక్తి కాల్చి చంపాడు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయాడు. ఈ సంఘటన భయాందోళన సృష్టించింది.

కాగా, నిందితుడ్ని ప్రదీప్‌గా పోలీసులు గుర్తించారు. ఏడాదన్నర కిందట భార్య అతడ్ని వీడి సురేంద్రతో కలిసి నివసిస్తున్నట్లు తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో కక్ష పెంచుకున్న ప్రదీప్ తన భార్య ప్రియుడైన సురేంద్రను కాల్చి చంపినట్లు పోలీసులు నిర్ధారించారు. నిందితుడైన ప్రదీప్ కోసం గాలించారు.

# స్వచ్ఛంద సంస్థల సేవలతో సమ్మిళిత సుస్థిరాభివృద్ధి

## (27 ఫిబ్రవరి "ప్రపంచ ప్రభుత్వేతర సంస్థల దినోత్సవం" సందర్భంగా)

సామాజిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న లాభాపేక్ష లేని నిస్వార్థ స్వచ్ఛంద పౌర సమూహాలను "ప్రభుత్వేతర సంస్థలు" లేదా "నాన్-గవర్నమెంటల్ ఆర్గనైజేషన్స్ (ఎన్జీవోస్)" అని పిలుస్తారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న పేదరికం, అసమానతలు, పరివారం కాలుష్యం, మానవీయ సమస్యలకు తగు పరిష్కారాలు చూపడానికి, సమాజాభివృద్ధి, సానుకూల మార్పులకు కృషి చేయడం, మానవ హక్కుల పరిరక్షణ, ఎన్జీవోల పట్ల అవగాహన పెంచడం లాంటి కార్యక్రమాలను నిర్వహించడానికి ప్రభుత్వేతర సంస్థలు ప్రపంచవ్యాప్తంగా నిరంతరం కృషి చేస్తున్నాయి. మెరుగైన పౌరసమాజ నిర్మాణానికి ఎన్జీవోలు చేస్తున్న కృషిని ఏకరువు పెట్టడానికి, వాటి పట్ల ప్రజలకు అవగాహన కల్పించడానికి సామాజిక కార్యకర్త "మార్కస్ లియర్స్ స్కద్మనిస్" నేతృత్వంలో 2009 నుంచి ప్రతి ఏట 27 ఫిబ్రవరి రోజున "ప్రపంచ ప్రభుత్వేతర సంస్థల దినోత్సవం (వరల్డ్ ఎన్జీవో డే)" వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

ప్రపంచ ఎన్జీవో టల దినోత్సవం-2026 ఇతివృత్తం:

ప్రతి వ్యక్తి తమకు తోచినట్లుగా విరాళాలు, శ్రమదానాలు, నిధులు సమకూర్చుకునే కార్యకలాపాలు, చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఈ వేదిక కోరుకుంటున్నది. ప్రపంచ ఎన్జీవోల దినోత్సవం-2026 ఇతివృత్తంగా "సమ్మిళిత మూల సూత్రంతో సుస్థిరాభివృద్ధి" అనే అంశాన్ని తీసుకొని ప్రచారాలు నిర్వహించడం జరుగుతున్నది. ఈ రోజున ఎన్జీవోల ప్రాధాన్యాన్ని వివరించాడానికి, ప్రోత్సహించడానికి తగు సదస్సులు, వెబినార్స్, కార్యశాలలు, శిక్షణ కార్యక్రమాలు, అవార్డుల ప్రదానాలు, క్షేత్రస్థాయి కార్యక్రమాలు, సంఘటిత కార్యక్రమాలు, పాలసీ వివరణలు, నిధుల సేకరణలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారాలు లాంటివి నిర్వహించవచ్చు.

భారత్‌లో ఎన్జీవోల ఉద్యమాలు:

నేటి ప్రజా సమస్యల సకారాత్మక పరిష్కారానికి ప్రభుత్వాలు చేస్తున్న కృషితో పాటు ప్రభుత్వేతర సంస్థల సహాయ సహకారాలు కూడా దోహదపడుతున్నాయి. ఆర్య సమాజ్, నేషనల్ కౌన్సిల్ ఫర్ వూమన్, సంకల్ప్ తరు ఫౌండేషన్ లాంటి స్వచ్ఛంద సంస్థల రాకతో భారత్‌లో ఎన్జీవోల ఉద్యమాలు ఊపందుకున్నాయి. గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, బాలల సంక్షేమం, ప్రజారోగ్యం, విపత్తుల నిర్వహణ, మానవ హక్కుల పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ లాంటి సమస్యలను ఎన్జీవోలు పరిష్కరించడానికి ప్రయత్నాలు చేయడం కొనసాగుతున్నది. నిధుల కొరత, సుస్థిరత, జవాబుదారీతనం, ప్రభుత్వ నిర్లక్ష్యం లాంటి సవాళ్లను ఎదుర్కొంటున్న ఎన్జీవోల ఉద్యమాలు కొనసాగుతున్నాయి. గివ్ ఇండియా, స్మైల్ ఫౌండేషన్, గూంజ్, హెల్పేజ్ ఇండియా, ఆక్షన్‌ఏయిడ్, చైల్డ్‌లైన్ ఇండియా ఫౌండేషన్ లాంటి ప్రముఖ ఎన్జీవోలు భారత దేశాభివృద్ధికి నిస్వార్థంగా సేవలు అందిస్తున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా దాదాపు 10 మిలియన్ల ఎన్జీవోల ద్వారా 50 మిలియన్ల స్వచ్ఛంద కార్యకర్తలు సేవలు అందిస్తున్నారు. ఇలాంటి ఎన్జీవో సంస్థలతో మనం కూడా కలిసి నిర్భాగ్యుల ముఖాల్లో ఆనంద భాష్యాలను చూద్దాం, బాధలే లేని భారతిని నిర్మిద్దాం.



-ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# పౌరుల ఆరోగ్యం సామూహిక బాధ్యత.. నిరుపేదలకు సకాలంలో, సరైన వైద్యం

## అందేలా చూసేందుకు భాగస్వాములంతా కలిసి పనిచేయాలి: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 26: ముంబైలోని లోక్‌భవన్‌లో నేడు (ఫిబ్రవరి 24, 2026) పీడీ హిందుజా ఆస్పత్రి చేపట్టిన 'ప్రాణాలను రక్షిద్దాం, ఆరోగ్య భారతాన్ని నిర్మిద్దాం' అనే దేశవ్యాప్త ప్రచార కార్యక్రమాన్ని భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు.

ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ.. పౌరులు ఆరోగ్యంగా ఉండేందుకు, నాణ్యమైన వైద్య సేవలను పొందేందుకు దశాబ్ద కాలంగా భారత ప్రభుత్వం ఎన్నో ముఖ్యమైన కార్యక్రమాలను చేపట్టిందన్నారు. దేశవ్యాప్తంగా 1,80,000కి పైగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు ఆరోగ్య సేవలను అందిస్తున్నాయని వెల్లడించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య బీమా పథకం ఆయుష్మాన్ భారత్ యోజన ద్వారా దాదాపు 12 కోట్ల కుటుంబాలకు.. ఆస్పతిలో వైద్య ఖర్చుల నిమిత్తం ఏడాదికి ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల ఆరోగ్య బీమా లభిస్తుందని చెప్పారు. మిషన్ ఇంద్రధనుష్, క్షయ రహిత భారత్ ప్రచారం, సికిల్ సెల్ అనీమియా నిర్మూలన మిషన్ వంటి జాతీయ కార్యక్రమాలు పౌరులను వ్యాధుల నుంచి రక్షించటంలో దోహదపడుతున్నాయని వెల్లడించారు. ప్రతిభావంతులైన వైద్యులు, పారామెడికల్ నిపుణుల లభ్యతను పెంచటానికి భారత ప్రభుత్వం ఎంబీబీఎస్, పోస్టు గ్రాడ్యుయేట్ సీట్ల సంఖ్యను పెంచింది. అందరికీ నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు వలు రాష్ట్రాల్లో కొత్తగా ఎయిమ్స్, మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రయత్నాలు సానుకూల ఫలితాలను ఇస్తున్నాయని చెప్పారు. ఆరోగ్యకరమైన భారతదేశ నిర్మాణంలో ప్రభుత్వంతో పాటు భాగస్వాములందరి పాత్ర కీలకమైనదన్నారు. ప్రతి పౌరుడికి నాణ్యమైన వైద్య సేవలందేలా అందరూ కలిసి పనిచేయాలని, ఇందులో భాగంగా సాగుతున్న ప్రయత్నమే 'ప్రాణాలను రక్షిద్దాం, ఆరోగ్య భారతాన్ని నిర్మిద్దాం' అనే ప్రచార కార్యక్రమమని తెలిపారు.

ప్రాణాన్ని కాపాడటమే అన్నిటి కన్నా గొప్ప దానమని రాష్ట్రపతి అన్నారు. అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండటం, ప్రాణాలను రక్షించటంలో అత్యంత కీలకమని తెలిపారు. ప్రమాదం జరిగిన మొదటి గంట సమయంలోనే సరైన వైద్యం అందిస్తే ఎన్నో ప్రాణాలను నిలబెట్టవచ్చని భావిస్తారు. తక్షణ వైద్య సాయం అందక ఎవరూ ప్రాణాలు కోల్పోకూడదనే ఉద్దేశంతో ప్రమాద బాధితులకు పీఎం రిలీఫ్ పథకం ద్వారా రూ.1.5 లక్షల వరకు నగదు రహిత చికిత్సను అందిస్తున్నట్లు వెల్లడించారు. తీవ్రమైన ప్రమాదాలు, అత్యవసర వైద్యం అందించాల్సిన సమయాల్లో ప్రాణాలను కాపాడేందుకు అంబులెన్సులు, ట్రామా సెంటర్లతో పాటు ప్రజలు కూడా అవగాహనతో ఉండటం ముఖ్యమని అన్నారు.

ఆరోగ్యవంతులైన పౌరులే దేశానికి బలమైన పునాది అని రాష్ట్రపతి అన్నారు. ప్రజలను వ్యాధుల నుంచి రక్షించటం, సరైన సమయంలో సరైన వైద్య సదుపాయాలను అందించటం వారిని ఆరోగ్యంగా ఉంచటంలో అత్యంత కీలకమని తెలిపారు. దేశ నిర్మాణంలో ఆరోగ్య రంగం అంతర్భాగం.. పౌరుల ఆరోగ్యం అందరి ఉమ్మడి బాధ్యత అని పేర్కొన్నారు. పేదరికంలో ఉన్న అట్టడుగు వ్యక్తికి కూడా సకాలంలో సరైన వైద్యం అందేలా భాగస్వాములంతా కలిసి పనిచేయాలన్నారు. 'అందరికీ అందుబాటులో ఉండే ప్రపంచ స్థాయి ఆరోగ్య సేవలు' ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని తెలిపారు.

ఇతర రంగాల్లోలానే ఆరోగ్య సంరక్షణలోనూ సాంకేతికత, ఏఐ కీలక పాత్ర పోషిస్తున్నాయని రాష్ట్రపతి తెలిపారు. భవిష్యత్తులో వీటి పాత్ర మరింత పెరగనున్న నేపథ్యంలో మనం సిద్ధంగా ఉండాలని చెప్పారు. నూతన ఆవిష్కరణలకు, కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా అమలు చేయటానికి అనువైన వ్యవస్థను భారత ప్రభుత్వం నిర్మిస్తుందని వెల్లడించారు. ఆరోగ్య సంరక్షణ రంగంలో ఏఐ ఆధారిత ఆవిష్కరణలకు ఇండియాఏఐ మిషన్ అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.

ఔషధ తయారీలో ప్రపంచంలోనే అగ్రగామిగా భారత్ ఉందని రాష్ట్రపతి తెలిపారు. మనదేశంలో తయారైన మందులు ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు ఉపయోగపడుతున్నాయన్నారు. అయినా అనేక వైద్య పరికరాలు, కీలకమైన ఔషధాల కోసం మనం ఇప్పటికీ దిగుమతులపైనే ఆధారపడుతున్నామని అన్నారు. ఈ దిగుమతి చేసుకున్న పరికరాలు, మందులు సామాన్య ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపుతున్నాయని చెప్పారు. మన పౌరులకు తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించాలంటే దేశీయంగా మందులు, పరికరాల తయారీ అత్యంత కీలకమని పేర్కొన్నారు. మేక్ ఇన్ ఇండియా, పీఎల్ఐ వంటి కార్యక్రమాలు ఈ దిశగా దోహదపడుతున్నాయని చెప్పారు. ఈ రంగంలో పరిశోధనలు, ఆవిష్కరణలు, అంకుర సంస్థలను ప్రోత్సహించటం ద్వారా దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని వైద్య రంగ నిపుణులను, వ్యాపార వర్గాలను ఆమె కోరారు.

2047 సంవత్సరం నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యంతో మనం ముందుకు సాగుతున్నామని రాష్ట్రపతి పేర్కొన్నారు. ఈ లక్ష్యాన్ని చేరుకోవటానికి ప్రాథమికంగా ఆరోగ్యవంతమైన పౌరులు అవసరమన్నారు. పౌరులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందినప్పుడే వారు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. మన సమష్టి కృషితో పౌరులందరికీ అత్యుత్తమ ఆరోగ్య సంరక్షణ అందుతుందని, తద్వారా ప్రపంచ ఆరోగ్య కేంద్రంగా భారత్‌కు మరింత గుర్తింపు లభిస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

# సరికొత్త సాంకేతికతల ఏకీకరణ ముఖ్యమని స్పష్టం చేసిన ఉపరాష్ట్రపతి

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 26: సాంకలా ఫౌండేషన్ సహకారంతో యూఎస్-ఇండియా పార్టనర్‌షిప్ ఫోరమ్ న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన టూరిజమ్ లీడర్‌షిప్ సమ్మిట్-2026ను ఉద్దేశించి ఉపరాష్ట్రపతి శ్రీ సి.పి. రాధాకృష్ణన్ ఈ రోజు ప్రసంగించారు.

పర్యటన రంగ ఆశలను ఉత్సవంలా జరుపుకోవడం ఒక్కటే కాకుండా ప్రయాణ, ఆతిథ్య రంగంలో భారత్-అమెరికా ఆర్థిక కారిడార్‌ను పటిష్ఠపరచడానికి ఒక వ్యూహాత్మక మార్గసూచీని కూడా ఆవిష్కరిస్తున్న ఓ వేదికను నిర్వాహకులు అందుబాటులోకి తీసుకు వచ్చారంటూ ఉపరాష్ట్రపతి ప్రశంసలు కురిపించారు.

పర్యటన రంగం కేవలం ఒక పరిశ్రమ కాదు... అంతకు మించిందని శ్రీ సి.పి. రాధాకృష్ణన్ స్పష్టం చేశారు. అది సంస్కృతుల మధ్య వారధిలా పనిచేస్తోందనీ, ఆర్థిక అవకాశాల్ని కల్పిస్తోందనీ, సామరస్యపూర్వక దౌత్యానికి ఒక శక్తిమంతమైన సాధనంగా ఉంటోందనీ వర్ణించారు.

భారత్, అమెరికాల పర్యటన రంగాలు రెండు దేశాల ప్రజల మధ్య పరస్పర సంబంధాలు, ఉమ్మడి విలువలు, ఔత్సాహిక పారిశ్రామికత్వ స్ఫూర్తిలతో పాటు భారతీయ ప్రవాసీ సముదాయం చైతన్యాన్ని కూడా చాటిచెబుతున్నాయని ఆయన అన్నారు.

భారత్ అమలుచేస్తున్న దూరదృష్టి కలిగిన కార్యక్రమాల్ని గురించి ఉపరాష్ట్రపతి ప్రస్తావిస్తూ, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో 'టూరిజమ్ విజన్-2029'ని భారత్ ప్రకటించిన సంగతిని గుర్తుకు తెచ్చారు. ప్రతి రాష్ట్రంలో పటిష్ఠ మౌలిక సదుపాయాల్నీ, ప్రపంచ స్థాయి పర్యటన స్థలాల్నీ అభివృద్ధి చేయడమే ఈ విజన్ ఉద్దేశమని ఆయన వివరించారు. ఈ కార్యక్రమం ఒక్క సౌందర్యీకరణకే పరిమితం కాదనీ, ఇది నిరంతరాయ సంధానం, ఆధునిక సౌకర్యాలు, భద్రత, స్థిరత్వం, డిజిటల్ ఏకీకరణలతో పాటు సమృద్ధ పర్యటక అనుభవాలతో కూడిన సమగ్ర పర్యటన అనుబంధ విస్తారిత వ్యవస్థలను ఏర్పాటు చేయడంపై శ్రద్ధ వహిస్తుందనీ ఉపరాష్ట్రపతి స్పష్టం చేశారు.

భారత నాగరికతా సంబంధ వారసత్వం, వైవిధ్యపూరిత భౌగోళిక స్వరూపం, జనాభాలో పని చేసే వయసున్న వారి సంఖ్య ఎక్కువగా ఉండటం వల్ల కలిగే ప్రయోజనాలను గురించి ఉపరాష్ట్రపతి వెల్లడిస్తూ, ప్రపంచ స్థాయిలో పర్యటన రంగానికి కొత్త నిర్వచనాన్ని ఇవ్వడానికి దేశం సిద్ధంగా ఉందన్నారు. ఉన్నత శ్రేణికి చెందిన పర్యాటక సౌకర్యాలు, వ్యాఖ్యాకేంద్రాలు, చివరి బిందువు వరకూ సంధాన సదుపాయం, మన్నిక కలిగిన పద్ధతులు, డిజిటల్ మాధ్యమం సాయంతో కథలను చెప్పే సౌలభ్యం వంటి వాటి ద్వారా భారత్‌లోని యునెస్కో ప్రపంచ వారసత్వ స్థలాల పరిరక్షణ, ప్రపంచ స్థాయి అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

పర్యావరణ సంబంధిత లక్ష్యాలకు అనుగుణంగా పర్యటన రంగ అభివృద్ధి ఉండాలని శ్రీ సి.పి. రాధాకృష్ణన్ సూచించారు. భిన్న వాతావరణ స్థితులకు తట్టుకొని నిలిచే మౌలిక సదుపాయాలు, సమాజమే సారథ్యాన్ని వహించే పర్యటన నమూనాలతో పాటు ప్రాకృతిక వారసత్వ, సాంస్కృతిక వారసత్వాల పరిరక్షణ ఎంతయినా అవసరం అని ఆయన అన్నారు.

అంతరిక్షం, డిజిటల్ మాధ్యమాన్ని ఉపయోగించుకొంటూ సేవలను ప్రజల అందుబాటులోకి తీసుకు రావడం, పునరుత్పాదక ఇంధనం, ఉన్నత శ్రేణికి చెందిన తయారీ సామర్థ్యం.. వీటిలో భారత్ సాధించిన విజయాలను కళ్లకు కట్టే సరికొత్త యుగపు పర్యటన స్థలాల్ని అభివృద్ధి పరచడంపైన దృష్టిని కేంద్రీకరించడం ముఖ్యమని కూడా ఆయన వివరించారు. పర్యటనానుభూతిని మెరుగుపరచడానికి కృత్రిమ మేధ వంటి ఆధునిక సాంకేతికతలను ఏకీకరించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

ఉపాధి అవకాశాల కల్పనకు అతి పెద్ద వనరుల్లో పర్యటన రంగం ఒకటని ఉపరాష్ట్రపతి చెప్పారు. సమ్మిళితత్వంతో కూడిన, సమాజమే చోదక శక్తిగా ఉంటూ అభివృద్ధి చోటుచేసుకొనేటట్లు చూడటానికి శిక్షణలోనూ, ఔత్సాహిక పారిశ్రామికత్వంలోనూ, మహిళల సారథ్యంలో పనిచేసే వాణిజ్య వ్యవస్థల్లోనూ మరిన్ని పెట్టుబడులను పెట్టాల్సిందిగా ఆయన పిలుపునిచ్చారు.

ఈ శిఖరాగ్ర సదస్సు భారత్-అమెరికా సహకారంలో స్థిరత్వం, నవకల్పన, సమ్మిళితత్వంతో పాటు ఉమ్మడి సమృద్ధికి కూడా వీలు కల్పించే ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందన్న ఆశాభావాన్ని శ్రీ సి.పి. రాధాకృష్ణన్ వ్యక్తం చేస్తూ, తన ప్రసంగాన్ని ముగించారు.

# సీఎంఆర్ఎఫ్ 13.85 కోట్లు మంజూరు

అమరావతి, ఫిబ్రవరి 26 : మైలవరం నియోజక వర్గంలో ఇప్పటివరకు రూ.13. 85 కోట్ల ఆర్థికసాయాన్ని సీఎం ఆర్ఎఫ్ నుంచి పేదలకు మంజూరు చేసినట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు వెల్లడించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన 16 మందికి మెరుగైన వైద్యసేవల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నుంచి తాజాగా లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్.ఓ.సి)లు మొత్తం రూ.20,53,447లు మంజూరయ్యాయి.

వీటిని విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని శాసన సభ్యుని వారి కార్యాలయంలో లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు గురువారం అందజేశారు. పేదలకు నాణ్యమైన వైద్య సేవల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయాన్ని అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. లబ్ధిదారుల తరపున సీఎం చంద్రబాబుకి, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పాడి రైతు కుటుంబానికి ఆర్థిక సాయం..

## -వైసిపి నేత కొమ్మినేని రవిశంకర్..

అమరావతి, ఫిబ్రవరి 26:ఎన్టీఆర్ జిల్లా మాగల్లు గ్రామంలో ఇటీవల మరణించిన పాల రైతు శంకరశెట్టి కృష్ణారావుకు కృష్ణ పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార ఆపదలో ఆపన్న హస్తం లా నిలిచిందన్నారు.

పాల రైతు కుటుంబాలకు తోడుగా మేమున్నామని భరోసా 108 లీటర్ల పాలు పోసి ఉండాలని దీనికోసం రైతు నుండి ఏ విధమైన ప్రీమియం చార్జీలు వసూలు చేయరని తెలిపారు.




సమితి కృష్ణ క్షీర బంధు పథకం ద్వారా ఆ కుటుంబానికి అండగా 50వేల రూపాయలు చెక్కు ను వైసీపీ నేత రవిశంకర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు కొమ్మినేని రవిశంకర్ మాట్లాడుతూ కృష్ణ మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ప్రవేశపెట్టిన కృష్ణ క్షీర బంధు పథకం కింద సంఘం పాల ఉత్పత్తి దారుడైన శంకర్ శెట్టి కృష్ణారావు మరణించడంతో ఆ కుటుంబానికి కల్పించడమే కృష్ణ క్షీర బంధు కృష్ణ మిల్క్ యూనియన్ ( విజయ డైరీ) లక్ష్యమని రవిశంకర్ అన్నారు. అనంతరం కృష్ణ మిల్క్ యూనియన్ మేనేజర్ మాట్లాడుతూ కృష్ణ మిల్క్ యూనియన్ వారి విజయ డైరీ కి పాలు పోసే రైతు ఏ కారణం చేతనైనా మరణించిన శోకస ముద్రంలో ఉన్న ఆ కుటుంబానికి యూనియన్ వారు 50,000 పరిహారం చెల్లించిందని అయితే ఆ రైతు మరణించిన తేదీ ముందు 365 రోజుల్లో కనీసం 180 రోజులు,

2019 జులై 1 నుంచి అమల్లోకి వచ్చిన ఈ పథకం వలన యూనియన్కు పాల రైతులుకు మధ్యాహ్నం ఉన్న బంధం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. మాగల్లు గ్రామంలో పాల రైతు శంకర్ శెట్టి కృష్ణారావు కుటుంబానికి అండగా ఉన్నా కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులుకు, మేనేజర్ సూపర్వైజర్కు పాల ఉత్పత్తిదారుల సంఘం , రైతులు హర్షం వ్యక్తం చేశారు.

# ఆశయ సాధనలో కార్యకర్తలే బలం

అమరావతి, ఫిబ్రవరి 26:విజయవాడ నగరంలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉత్సాహంగా ప్రారంభమైంది. పార్టీ స్థాపకుడు పవన్ కళ్యాణ్ ఆశయాల సాధన కోసం నిస్వార్థంగా పనిచేసే కార్యకర్తలే తమ బలమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. కృష్ణలంక 20వ డివిజన్‌లో విజయవాడ పార్లమెంట్ ఇంచార్జ్, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అమిశెట్టి వాసు ఆధ్వర్యంలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి మంత్రి నాదెండ్ల మనోహర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం ఘనంగా ప్రారంభమైందని, ఇది మార్చి 10వ తేదీ వరకు నిరంతరాయంగా కొనసాగుతుందని తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుంచి సభ్యత్వాల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని పేర్కొంటూ, ప్రారంభ దశలో కేవలం 90 వేల సభ్యులతో మొదలైన ప్రస్థానం, గత ఏడాదికి 13 లక్షల సభ్యత్వాలను దాటిందన్నారు. ఇది పార్టీపై ప్రజల్లో పెరుగుతున్న ఆదరణకు నిదర్శనమని తెలిపారు. ప్రత్యేకంగా విజయవాడ ఈస్ట్ నియోజకవర్గంలో సభ్యత్వాలు గతంతో పోలిస్తే పది రెట్లు పెరగడం గమనార్హమని మంత్రి వెల్లడించారు.

కూటమి ప్రభుత్వ విజయంలో కీలక పాత్ర పోషించిన జనసైనికులు, వీర మహిళలు ఇప్పుడు పార్టీని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నరసాపురం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్, సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త బోలిశెట్టి వంశీ, నందిగామ నియోజకవర్గ సమన్వయకర్త దుర్గా మల్లేశ్వర స్వామి, దేవస్థానం బోర్డు సభ్యురాలు తంబళ్లపల్లి రమాదేవి, పీఏసీ సంయుక్త కార్యదర్శి పోతిరెడ్డి అనిత, రీజినల్ కోఆర్డినేటర్ మల్లెపు విజయలక్ష్మి, జిల్లా కార్యదర్శి బంద్రెడ్డి రవి, నగర ఉపాధ్యక్షుడు కామల్ల సోమనాదం, 20వ డివిజన్ అధ్యక్షుడు జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కదిలే రైలు నుంచి పడి బాలికకు ప్రమాదం

విజయవాడ, ఫిబ్రవరి 26:ఒంగోలు సమీపంలో పరుగు తీస్తున్న రైలులో నుంచి ప్రమాదవశాత్తూ పడిపోయిన చిన్నారిని రైల్వే సిబ్బంది, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ సంయుక్తంగా అప్రమత్తంగా స్పందించి సురక్షితంగా కాపాడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో బాలిక స్వల్ప గాయాలతో బయటపడింది. ఫిబ్రవరి 25 రాత్రి 11:53 గంటలకు ధర్మవరం-నరసాపురం ఎక్స్‌ప్రెస్ ట్రైన్ మేనేజర్ సమాచారం మేరకు, సూరారెడ్డిపాలెం ఒంగోలు మధ్యలో, ఒంగోలు స్టేషన్‌కు సుమారు 2 కిలోమీటర్ల దూరంలో సుమారు 9 సంవత్సరాల బాలిక పరుగు తీస్తున్న రైలు నుంచి పడిపోయింది.

రాత్రి 12:03 గంటలకు రైలు ఒంగోలు చేరుకోగానే బాలిక తల్లిదండ్రులు దిగిపడి వెంటనే రైల్వే అధికారులకు, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న స్టేషన్ అధికారులు వెంటనే అప్రమత్తమై, వెంటనే వెనుక నుంచి వస్తున్న తిరుపతి- కరీంనగర్ ఎక్స్‌ప్రెస్ సిబ్బందికి సమాచారం చేరవేశారు.

తదనంతరం లోకో పైలట్ బాలికను గుర్తించి ఒంగోలు సమీపంలోని ఇంటర్మీడియట్ బ్లాక్ సిగ్నల్ వద్ద రైలును ఆపాడు. ముందుభాగంలోని జనరల్ కోచ్‌లో ఉన్న ప్రయాణికులు బాలికను సురక్షితంగా ఎత్తుకొని కాపాడారు. ఇదే సమయంలో ట్రాక్‌లపై గాలింపు చర్యలు చేపట్టిన ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ సిబ్బంది కూడా సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

# తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జే జయలలితకు ప్రధానమంత్రి నివాళి

నల్గొండ, ఫిబ్రవరి 26:ఈ రోజు తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జే జయలలిత జయంతి సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నివాళులు అర్పించారు. ప్రజాకర్షక నాయకురాలిగా, గొప్ప పరిపాలనా దక్షురాలిగా ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయారని ప్రధానమంత్రి కొనియాడారు.

తమిళనాడు ముఖ్యమంత్రిగా ఆమె పని చేసిన కాలాన్ని శ్రీ మోదీ గుర్తు చేశారు. మహిళా సాధికారత, సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ.. సంక్షేమ పాలన అందించారన్నారు. ఆమెతో జరిపిన సంభాషణలను ప్రధానమంత్రి ఆనందంగా గుర్తు చేసుకున్నారు. ఆమె జీవితం, కృషి గురించి కొన్ని ప్రత్యేక అంశాలను ఈ నెల మన్ కీ బాత్ కార్యక్రమంలో శ్రీ మోదీ పంచుకున్నారు.

"జయలలిత గారు జయంతి సందర్భంగా ఆమెను స్మరించుకుంటున్నాను. అనేక మంది హృదయాలు, ఆలోచనల్లో ప్రజాకర్షణ ఉన్న నాయకురాలిగా, గొప్ప పరిపాలనా దక్షురాలిగా ఆమె శాశ్వత స్థానం సంపాదించుకున్నారు. ఆమె జీవితమంతా ధైర్యాన్ని, సంకల్పాన్ని ప్రదర్శించారు. మహిళా సాధికారత, సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధిపై దృష్టి సారించి విజయవంతంగా సంక్షేమ పాలనను అందించారు.

# శ్రీనగర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయాణికుల విభాగ విస్తరణకు కేబినెట్ ఆమోదం

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 26:శ్రీ నగర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దాదాపు రూ.1,677 కోట్ల అంచనా వ్యయంతో ప్రయాణికుల విభాగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఇవాళ ఆమోదం తెలిపింది. కాశ్మీర్ లోయలో విమానయాన రంగ మౌలిక సదుపాయాలను, అనుసంధానతను బలోపేతం చేసేందుకు ఈ ప్రాజెక్టు కీలకం. ఈ ప్రాజెక్టులో భాగంగా భద్రతా సిబ్బంది కోసం బ్యారెక్‌లను నిర్మించనున్నారు. భారత వైమానిక దళం (ఐఏఎఫ్)కి చెందిన బుద్గాం ఎయిర్ బేస్ ప్రాంగణంలోని ఈ విమానాశ్రయం ఇండియా ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ (ఏఏఐ) పరిధిలో ఉంది. శ్రీనగర్ నుంచి సుమారు 12 కి.మీ దూరంలోని ఈ విమానా శ్రయాన్ని 2005లో అంతర్జాతీయ విమానాశ్రయంగా గుర్తించారు.

73.18 ఎకరాల్లో విస్తరించనున్న ఈ నూతన ప్రయాణికుల విభాగంలో అత్యాధునిక సౌకర్యాలతో టెర్మినల్ భవనాన్ని నిర్మిస్తారు. 71,500 చదరపు మీటర్ల (ప్రస్తుతమున్న 20,659 చదరపు మీటర్ల నహా) విస్తీర్ణంలో ఈ టెర్మినల్ ఉంటుంది. రద్దీ సమయాల్లో 2,900 మంది ప్రయాణికులు, ఏడాదికి 10 మిలియన్ల మంది ప్రయాణికులు (ఎంపీపీఏ) రాకపోకలు సాగించేలా ఈ టెర్మినల్‌ను డిజైన్ చేశారు. విస్తరించిన ఏప్రాన్ లో మొత్తం 15 విమాన పార్కింగ్ స్థలాలు ఉండగా..1 వైడ్ బాడీ (కోడ్ ఈ) విమానానికి స్థలం కేటాయించారు (మొత్తం15లో ప్రస్తుతమున్నవి 9 కాగా, 6 కొత్తగా ప్రతిపాదించినవి). 3,658 మీటర్ల పొడవు, 45 మీటర్ల వెడల్పు గల రన్ వే ఐఏఎఫ్ నిర్వహణలోనే ఉంటుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా 1,000 కార్లను పార్కింగ్ చేసేలా, మల్టీ లెవల్ కార్ పార్కింగ్ సౌకర్యాన్ని కల్పించనున్నారు.

ఆధునిక డిజైన్, కాశ్మీర్ సాంస్కృతిక వారసత్వ కలయితో ఈ కొత్త టెర్మినల్ నిర్మాణం ఉంటుంది. ఇందులో చెక్కతో చేసే ప్రత్యేకమైన కళ, స్థానిక కళాకృతుల వంటి సంప్రదాయ అంశాలతో ప్రయాణికులకు సత్వర సేవలు అందించే, విశాలమైన విశ్రాంతి ప్రదేశాలు, అత్యాధునిక భద్రత, చెక్-ఇన్ సదుపాయాలను కల్పించటం ద్వారా కార్యకలాపాల సామర్థ్యాన్ని పెంపొందిస్తారు.

స్థిరత్వమే అభివృద్ధికి ప్రధానాంశంగా చేపట్టనున్న ఈ నిర్మాణంలో వర్షపు నీటి నిల్వకు అత్యాధునిక వ్యవస్థలు, విద్యుత్ వినియోగాన్ని తగ్గించేందుకు సహజంగా వెలుతురు వచ్చే ఏర్పాట్లు, కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు స్థానికంగా లభించే పర్యావరణ అనుకూల సామాగ్రిని ఉపయోగించారు. ప్రతిష్ఠాత్మకమైన 5 స్టార్ గృహ రేటింగ్ సాధించటమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును రూపొందించారు.

ఈ ప్రాజెక్టు కేవలం మౌలిక సదుపాయాల అభివృద్ధికే కాక, దాల్ సరస్సు, శంకరాచార్య ఆలయం, మొఘల్ గార్డెన్స్ వంటి ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలకు రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచటం ద్వారా పర్యాటకం, ఆర్థిక వృద్ధి గణనీయంగా పెరుగుతాయి. దీంతో ఉపాధి అవకాశాలు ఏర్పడి, పెట్టుబడులు పెరుగుతాయి.

తద్వారా ప్రధాన పర్యాటక ప్రాంతంగా, ఆర్థిక కేంద్రంగా శ్రీనగర్ స్థానం బలపడుతుంది. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను అందించటంలో ప్రయాణికుల విభాగం అభివృద్ధి పరివర్తనాత్మక మార్పును సూచిస్తుంది. ఇది ప్రయాణికులకు మెరుగైన వసతులను, రవాణా సౌకర్యాలను కల్పించటమే కాకుండా కాశ్మీర్ సాంస్కృతిక, ప్రకృతి సౌందర్యాన్ని ప్రపంచానికి చాటిచెబుతుంది.

## మహారత్న సీపీఎస్ఈలకు అధికారాల అప్పగించే ప్రస్తుత మార్గదర్శకాల నుంచి పవర్‌గ్రిడ్‌కు అదనపు అధికారాలను కల్పించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 26:మహారత్న సీపీఎస్ఈలకు వర్తించే అధికారాల అప్పగింతపై ప్రభుత్వ సంస్థల విభాగం (డీపీఈ) ఫిబ్రవరి 4, 2010 నాటి మార్గదర్శకాల ప్రకారం పవర్‌గ్రిడ్‌కి మెరుగైన అధికారాలు కల్పించే నిర్ణయానికి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఈ రోజు ఆమోదం తెలిపింది. ఈ ఆమోదం కంపెనీ నికర విలువలో 15 శాతంగా ఉన్న ప్రస్తుత పరిమితిని నిలుపుకుంటూనే పవర్ గ్రిడ్ కోసం అనుమతించదగిన ఈక్విటీ పెట్టుబడి పరిమితిని ప్రతి అనుబంధ సంస్థకు రూ.5,000 కోట్ల నుంచి రూ.7,500 కోట్లకు పెంచడానికి వీలు కల్పించింది.

ఈ ఆమోదం దేశంలో అతిపెద్ద, అత్యంత అనుభవం గల ట్రాన్స్‌మిషన్ సర్వీస్ ప్రొవైడర్ అయిన పవర్‌గ్రిడ్ తన ప్రధాన వ్యాపారంలో పెట్టుబడిని విస్తరించుకోవడానికి, పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని తరలించడంలో మద్దతునివ్వడానికి వీలు కల్పిస్తుంది. శిలాజేతర వనరుల ద్వారా 500 గిగావాట్ల లక్ష్యాన్ని సాధించడంలోనూ ఇది సహాయపడుతుంది. పవర్‌గ్రిడ్ ఇప్పుడు అల్ట్రా హై వోల్టేజ్ ఆల్టర్నేటింగ్ కరెంట్ (యూహెచ్‌వీఏసీ), హై వోల్టేజ్ డైరెక్ట్ కరెంట్ (హెచ్‌వీడీసీ) ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్‌ల వంటి క్యాపిటల్-ఇంటెన్సివ్ ట్రాన్స్ మిషన్ ప్రాజెక్టుల బిడ్లలో పాల్గొనడానికి వీలుంటుంది. కీలకమైన ట్రాన్స్ మిషన్ ప్రాజెక్టుల బిడ్డర్ల ఎంపిక కోసం టారిఫ్ బేస్డ్ కాంపిటీటివ్ బిడ్డింగ్ (టీబీసీబీ)లో పోటీనీ ఇది విస్తృతం చేస్తుంది. ఇది మెరుగైన ధరల ఆవిష్కరణను నిర్ధారిస్తుంది. వినియోగ దారులకు సరసమైన, స్వచ్ఛమైన ఇంధనం అందుబాటులో ఉండేలా చేస్తుంది.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలి : నూతన కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్, ఫిబ్రవరి 24: పభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు సూచించారు. రాష్ట్రంలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగిన అనంతరం కలెక్టర్లుగా జిల్లాకు బదిలీ అయిన అధికారులు వెంటనే ఆయా జిల్లాలకు వెళ్లి బాధ్యతలు స్వీకరించారు.

ఈ సందర్భంగా నూతన కలెక్టర్‌గా బదిలీ అయిన ప్రతిమా సింగ్ జిల్లాకు చేరుకోవడంతో అదనపు కలెక్టర్ నగేష్, డి ఆర్వో భుజంగ రావు, మెదక్ ఆర్డీవో రమాదేవి స్వాగతం పలికారు. బాధ్యలు స్వీకరించిన అనంతరం అధికారులు జిల్లా అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను నెరవేర్చుతూ ,ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేస్తానన్నారు. ఇంటర్, పదో తరగతి పరీక్షల గురించి డీఈవోను, ఇంటర్ బోర్డు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అండగా ఉన్నాం.. ధైర్యంగా ఉండండి

**-కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు**

**-డయేరియ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన కేంద్ర మంత్రి.**



శ్రీకాకుళం, ఫిబ్రవరి 26:శ్రీ కాకుళం నగరాన్ని డయేరియా వ్యాధి ఇబ్బంది పెడితే.. జిల్లా యంత్రాంగం దాన్ని సమర్ధవంతంగా ఎదుర్కొని.. తిరిగి నాలుగు రోజుల్లోనే సాధారణ స్థితికి తీసుకువచ్చారని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. గురువారం నాడు శ్రీకాకుళం నగరంలో డయేరియా ప్రభావిత ప్రాంతాలు మంగువారితోట దగ్గరలోని కంద్ర వీధి, ధమ్మల వీధి ప్రాంతాలలో వ్యాధి బారిన పడ్డ వారిని, ఆసుపత్రి నుండి డిశ్చార్జి అయినవారిని, అదేవిధంగా వ్యాధి కారణంగా మృత్యువాత పడ్డ కంద్ర వీధికి చెందిన పడ్డ సురేష్ కుటుంబాన్ని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్ లతో కలిసి పరామర్శించారు.

అనంతరం కిమ్స్, జేమ్స్, రిమ్స్ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి.. వారికి అందుతున్న వైద్య సదుపాయాల గురించి ఆరా తీశారు. అన్ని రకాలుగా తోడ్పాటు అందిస్తామని ధైర్యంగా ఉండాలని వారికి భరోసా ఇచ్చారు.

ఈ సందర్భంగా మీడియాతో కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. శ్రీకాకుళం నగరంలో నాలుగు రోజుల క్రితం డయేరియ కేసులు నమోదు ప్రారంభం అయితే రాష్ట్ర ప్రభుత్వం సత్వరం స్పందించి.. క్షేత్ర స్థాయిలో నిరంతర పరిశీలన, సమీక్షలు చేస్తూ.. నిన్నటికే సాధారణ స్థితికి తీసుకొచ్చారని అన్నారు. అధికార యంత్రాంగం సత్వరం స్పందించారని తెలిపారు.డయేరియా కారణంగా మృతి చెందిన సురేష్ కుటుంబానికి అన్ని విధాల ఆదుకుంటామని తెలిపారు.. ప్రస్తుతానికి జెమ్స్, కిమ్స్, రిమ్స్, జి.జి.హెచ్ ఆసుపత్రులలో నిన్నటికి 124 కేసులు ఉండగా.. అందులో ఇరవై రెండు డిశ్చార్జి కావడంతో 102 కేసులు ఉన్నాయని అన్నారు. ఇందులో కొన్ని మాత్రమే ఇబ్బంది ఉండగా.. మిగిలిన వారి పరిస్థితి బాగానే ఉందని తెలిపా రు. తొలి కేసు నమోదు అయిన నాటి నుండే కలెక్టర్ స్వప్నిల్ దినకర్ సత్వరం స్పందించారని.. క్షేత్ర స్థాయిలో పర్యటనలు జరిపి.. అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారని అన్నారు.

డయేరియా ఆసుపత్రులలో ఉన్నవారికి మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. మంచినీటి సమస్యపై ఇప్పటికే శాంపిల్ లను కూడా తీసుకుని పరిక్షల కోసం పంపించామని.. ఫుడ్ ద్వారా ఇబ్బంది జరిగిందా అన్న కోణంలో కూడా విశ్లేషణ జరుపుతున్నారని అన్నారు. అన్ని దిశల్లో దర్యాప్తు చేసి.. వ్యాధి ఉధృతికి గల అసలు కారణాన్ని తెలియచేస్తామని అన్నారు. మరో వైపు నగరంలో మంచినీటి సరఫరాపై కూడా మంత్రి నారాయణ క్షేత్ర స్థాయిలో పర్యటన చేసి పూర్తి పరిశీలన చేశారని అన్నారు. ఆయన పలు సూచనలు చెయ్యగా.. ఆ దిశగా అభివృద్ధి పనులు కూడా కార్యరూపం దాల్చాయని అన్నారు.

గతంలో కార్పొరేషన్ ను సిండికేట్ గా మార్చి దగా చేసారని.. వాటికి స్వస్తి పలుకుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన స్వచ్ఛాంధ్ర పిలుపుతో శానిటేషన్, ఇతర శుభ్రత కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతు న్నాయని.. ఎవ్వరూ ఆందోళన చెందవద్దని తెలిపారు. మంత్రి నారా యణ తెలిపిన మేరకు సుమారు 100 కోట్ల రూపాయల అభివృద్ధి పనుల ద్వారా కార్పొరేషన్ అభివృద్ధి దిశగా సమూల మార్పులు చేస్తూ అభివృద్ధికి పధకరచన చేశామని అన్నారు.సుడా ద్వారా మరో 12కోట్ల రూపాయల తో డ్రయిన్లను ఆధునీకరిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీ రాజ్ కుమార్, డిఎంహెచ్ఓ కె. అనిత, జిజిహెచ్ సూపరింటెంట్ ఎల్ ప్రసన్న కుమార్, రిమ్స్ ప్రిన్సిపల్ ఎస్. అప్పలనాయుడు, ఆర్ ఎంఓ సుభాషిని, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం తొలి విడత చర్చలు ప్రారంభించిన భారత్ - ఇజ్రాయెల్

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 26:భారత్ - ఇజ్రాయెల్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్టీఏ) తొలి విడత చర్చలు 2026 ఫిబ్రవరి 23న న్యూఢిల్లీలో మొదలయ్యాయి. ఇవి ఫిబ్రవరి 26 వరకు జరుగుతాయి. వాణిజ్యం, ఆర్థిక సహకారాన్ని పెంపొందించేందుకు గుర్తించిన అంశాలపై చర్చల కోసం ఒక నిర్మాణాత్మక ప్రాతిపదికను ఏర్పాటు చేస్తూ 2025 నవంబర్‌లో నిబంధనల పత్రాన్ని (టీఓఆర్) ఖరారు చేశారు.

2024-2025 ఆర్థిక సంవత్సరంలో ఇరు దేశాల మధ్య మొత్తం వస్తు వాణిజ్యం 3.62 బిలియన్ డాలర్లుగా నమోదైంది. భారత్, ఇజ్రాయెల్ పలు రంగాలలో పరస్పర సహకారాన్ని కలిగి ఉన్నాయి. ఈ ఎఫ్టీఏ ఎంఎస్ఎంఈలతో సహా వ్యాపార సంస్థలకు భరోసా, స్పష్టత కల్పిస్తూ ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత పెంచేందుకు దోహదపడుతుంది.

ఈ విడతలో ఇరుపక్షాల సాంకేతిక నిపుణులు వస్తువుల వాణిజ్యం, సేవల వాణిజ్యం, రూల్స్ ఆఫ్ ఆరిజిన్, శానిటరీ -ఫైటోశానిటరీ చర్యలు, వాణిజ్య సాంకేతిక అడ్డంకులు, కస్టమ్స్ విధానాలు, వాణిజ్య సరళీకరణ, మేధో సంపత్తి హక్కులు వంటి వివిధ అంశాలపై చర్చలు జరుపుతారు.

ప్రారంభ సమావేశంలో వాణిజ్య కార్యదర్శి శ్రీ రాజేష్ అగర్వాల్ ప్రసంగిస్తూ, గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2026 ఫిబ్రవరి 25-26 తేదీలలో ఇజ్రాయెల్ సందర్శిస్తున్న తరుణంలో, ఈ చర్చలు మొదలవ్వడం సరైన సమయమని పేర్కొన్నారు. ఆవిష్కరణ, , సైన్స్, టెక్నాలజీ, కృత్రిమ మేధ, సైబర్ సెక్యూరిటీ, అత్యాధునిక తయారీ, వ్యవసాయం, సేవల రంగాలలో ఇరు దేశాలకు ఉన్న గొప్ప అవకాశాలను శ్రీ అగర్వాల్ వివరించారు. ఈ అవకాశాలను పూర్తిగా వినియోగించుకోవడానికి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం తోడ్పడుతుందని ఆయన చెప్పారు.

చర్చల్లో భారత ప్రధాన ప్రతినిధి, వాణిజ్య శాఖ అదనపు కార్యదర్శి శ్రీ అజయ్ భదూ ఇరు దేశాల మధ్య ఈ చర్చల ప్రాముఖ్యతను పునరుద్ఘాటించారు. మారుతున్న భాగస్వామ్యానికి అనుగుణంగా భవిష్యత్తు అవసరాలను తీర్చేలా, సమతుల్యమైన ఒప్పందం కోసం ఇరుపక్షాలు కృషి చేయాలని ఆయన కోరారు. ఇజ్రాయెల్ వాణిజ్య విధానాల విభాగం సీనియర్ డైరెక్టర్, డిప్యూటీ ట్రేడ్ కమిషనర్, చర్చల్లో ఆ దేశ ప్రధాన ప్రతినిధి శ్రీమతి యిఫత్ అలోన్ పెరెల్ మాట్లాడుతూ, ఇరు దేశాల మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయడానికి, సహకారాన్ని పెంచడానికి, రెండు దేశాలకు కొత్త మార్కెట్లను అందుబాటులోకి తెచ్చేందుకు దోహదపడుతుందని ఆవె ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ చర్చలు భారత్-ఇజ్రాయెల్ ద్వైపాక్షిక సంబంధాల వ్యూహాత్మక ప్రాముఖ్యతను చాటిచెబుతున్నాయి. జాతీయ ప్రాధాన్యతలు, ప్రపంచ ఆకాంక్షలకు అనుగుణంగా ఆర్థిక భాగస్వామ్యాలను బలోపేతం చేయాలనే భారత నిబద్ధతను ఇవి బలపరుస్తున్నాయి. ఇరుపక్షాలు సమతుల్యమైన, పరస్పర ప్రయోజనకరమైన ఒప్పందాన్ని ఖరారు చేసే దిశగా కృషి చేస్తున్నాయి.

# ఉద్యోగులకు రెండో పీఆర్సీని అమలు చేయాలి : చావ రవి

నల్గొండ, ఫిబ్రవరి 26: ఐదేండ్లకోమారు అమలు చేయాల్సిన వేతన సవరణను ఎనిమిదేళు అవుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సమంజసం కాదని, ఇప్పటికే 32 నెలలు గడిచినందున ఇంకా జాప్యం చేయకుండా పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించుకుని సంఘాలతో చర్చించి సమంజసమైన ఫిట్‌మెంట్‌తో 2023 జులై 1 నుండి అమలు చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి డిమాండ్ చేశారు. గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నారని తప్పుబట్టారు. 2024 మార్చి నుండి రిటైరైన ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని, పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని, డీఏ వాయిదాలను విడుదల చేయాలని కోరారు.

రాష్ట్రపతి ఉత్తర్వులు 2018కి అనుగుణంగా ఉపాధ్యాయుల సర్వీసు నిబంధనలను రూపొందించి డీఈఓ, డిప్యూటీ ఈఓ, ఎంఈఓ తదితర పర్యవేక్షణ అధికారుల పోస్టులు భర్తీ చేయడం ద్వారా విద్యా శాఖలో నెలకొన్న సంక్షోభాన్ని నివారించాలని కోరారు. ఆశ్రమ పాఠశాలల సిఆర్టీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కేజీబీవీ, యుఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగులకు బేసిక్ పే ఇవ్వాలని, గురుకులాల్లో ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య కార్డులపై నగదు రహిత వైద్యం అందించాలనే ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని అయితే ఉద్యోగులు, పెన్షనర్లపై చందా భారాన్ని తగ్గించాలని కోరారు. గురుకులాలు, మోడల్ స్కూల్స్, ఎయిడెడ్ పాఠశాలలు, కేజీబీవీ, సమగ్ర శిక్ష ఉద్యోగులకు కూడా తొలిదశలోనే ఇహెచ్ఎస్ ను అమలు చేయాలన్నారు.

టెట్ మినహాయింపు విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని అర్హత మార్కులను తగ్గించి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఉ రాష్ట్ర కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం, జిల్లా అధ్యక్షుడు బక్కా శ్రీనివాస్ చారి, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎడ్ల సైదులు, ఉపాధ్యక్షురాలు బడుగు అరుణ, కోశాధికారి వడిత్య రాజు, జిల్లా కార్యదర్శులు మోర్తాల శ్రీనివాస్ రెడ్డి, నలపరాజు వెంకన్న, ఎ.చిన వెంకన్న, కొమ్రరాజు సైదులు పాల్గొన్నారు.

## బాజా సే ఇండియా పోటీలు నిర్వహించడం అభినందనీయం : ఎస్పీ డి.వి శ్రీనివాసరావు

మెదక్, ఫిబ్రవరి 26:బాజా సే ఇండియా-2026 (బగ్గీల) పోటీలు బి వి ఆర్ ఐ టి ఆధ్వర్యంలో మెదక్ జిల్లాలో నిర్వహించడం అభినందనీయమని ఎస్పీ డి.వి శ్రీనివాస రావు కొనియాడారు. గురువారం నర్సాపూర్ పట్టణ సమీపంలోని బి వి ఆర్ ఐ టి కళాశాలలో మెకానికల్ బాజా సే ఇండియా-2026 మొదటి రోజు ఈవెంట్లో భాగంగా బగ్గీల టెక్నికల్ విషయాలపై విస్తృత స్థాయి పరిశీలనలు జరిగాయి. బాజాసే ఇండియా జాయింట్ కన్వీనర్ డా.వి. మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడిషనల్ ఎస్పీ మహేందర్ తో కలిసి శ్రీనివాసరావు హాజరై జెండా ఊపి బగ్గీలకు బ్రేక్ టెస్ట్, టెక్నికల్ ఇన్స్పెక్షన్, స్టాటిక్ ఈవెంట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి పోటీలు విద్యార్థుల భవిష్యత్తుకు దిశానిర్దేశం చూపిస్తాయన్నారు.

ఉద్యోగ కల్పన కోసం ఖర్చుకు వెనకాడకుండా ఇలాంటి పోటీలు నిర్వహిస్తున్న మేనేజ్మెంట్ గొప్పతనాన్ని ప్రశంసించారు. మెకానికల్ బాజా సే ఇండియా కన్వీనర్ అలీ సయ్యద్ మాట్లాడుతూ గురువారం నాడు టెక్నికల్ ఇన్స్పెక్షన్, బ్రేక్ టెస్ట్, స్టాటిక్ ఈవెంట్లు ? డిజైన్, సీఏఈ, ద్రోణాచార్య ఈవెంట్, వాలిడేషన్ ఈవెంట్, డైనమిక్ ఈవెంట్లు, స్లెడ్ ఫుల్ ఈవెంట్ తదితర ఈవెంట్లను నిర్వహించడం జరిగిందని వెల్లడించారు. ఈ సీజన్లో నూతనంగా హోండా జీఎక్స్ 430 ఇంజిన్ ను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ పోటీల్లో తెలంగాణ జట్లు ప్రతిభ కనబరచాయని, 10 ప్రతిభావంతమైన జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయని అన్నారు.

ఇవే కాకుండా మార్చి 2,3వ తేదిల్లో బీవీఆర్ఐటీ ఆధ్వర్యంలో హెచ్ఆర్ మీట్ నిర్వహించి పరిశ్రమ నిపుణులతో పరిచయాలు, ఉద్యోగ అవకాశాలు, స్పాట్ ఆఫర్లు వంటి విలువైన అవకాశాలు ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థిని, విద్యార్థులకు లభిస్తాయన్నారు.

ఈ కార్యక్రమంలో బాజా సే ఇండియా ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ బాల్రాజ్ సుబ్రమణ్యం, అడ్వైజర్ డా.కె.సి ఓరా, ప్రిన్సిపాల్ సంజయ్ దూబే, డైరెక్టర్ డా. లక్ష్మీప్రసాద్, బాజా స్టీరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మహా పాదయాత్రకు గ్రామాల్లో ఘన స్వాగతం

మెదక్, ఫిబ్రవరి 26:ఆధ్యాత్మిక చింతన, భక్తి ప్రబోధం, సంప్రదాయ పరిరక్షణ లక్ష్యాలతో సద్గురు లింగప్ప స్వామి, లింగయ్య స్వామిజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాపాద యాత్ర గురువారం సిద్దిపేట జిల్లా రాయపోల్‌కు చేరుకుంది.

యాత్రలో నాగభూషణ్ స్వామి (దామరచెర్ల), రాజా మహారాజ్ (కర్ణాటక), సంతేశ్ మహారాజ్ (గుంటకల్), అల్ల మహారాజ్ (అమరావతి), చంద్రశేఖర్ స్వామి (పాములపల్లి), రామస్వామి (బెంగళూరు విద్యార్థి) , వీరభద్ర స్వామి పాల్గొన్నారు.

ఈనెల 20న ప్రారంభమైన పాదయాత్ర మార్చి 1న ముగిస్తుందని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని కోరారు.ఈ మహా పాదయాత్రకు రాయపోల్ మండల కేంద్రంలో భక్తులు ఘనంగా స్వాగతం పలికారు.

# 'స్పష్టమైన దృష్టి లేకపోతే పనులు కష్టతరం'




నల్గొండ, ఫిబ్రవరి 26: మానవ శరీరంలో అత్యంత సున్నితమైన, విలువైన అవయవాలలో కండ్లు ఒకటని, స్పష్ట మైన చూపు లేకపోతే జీవితంలో అనేక పనులు కష్టతరంగా మారుతాయని లయన్స్ క్లబ్ ఆఫ్ సేవా చౌటుప్పల్ అధ్యక్షుడు తిరందాసు జగన్నాథం అన్నారు. చౌటుప్పల్ పురపాలిక కేంద్రంలోని వలిగొండ రోడ్డు సమీపంలో డత లయన్స్ క్లబ్ భవనంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సేవా ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు, మధుమేహ, రక్తపోటు పరీక్షలను నిర్వహించారు. కంటి వైద్య నిపుణురాలు గుంటోజు సంధ్యారాణి పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించారు. పుర ప్రజలు పలువురికి కూడా మధుమేహ రక్తపోటు పరీక్షలు జరిపి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ మాట్లాడుతూ ఆరోగ్యవే మహాభాగ్యమని అన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. ప్రతినిత్యం ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ విజయమోహన్, లైయన్స్ క్లబ్ ఆఫ్ సేవా కార్యదర్శి అతహర్ పాషా, సభ్యులు కాసుల వెంకటేశం, కటికం ప్రశాంత్, కొనసం రామిరెడ్డి పాల్గొన్నారు.

# భారత్ - జీసీసీ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంయుక్త ప్రకటనపై ఇరు పక్షాల సంతకాలు

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 26:భారత్ – జీసీసీ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)పై ఉమ్మడి ప్రకటనపై 2026 ఫిబ్రవరి 24న న్యూఢిల్లీలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్, గౌరవ గల్ఫ్ సహకార మండలి ప్రధాన కార్యదర్శి జాసెమ్ మహమ్మద్ అల్బుదైవీ సంతకాలు చేశారు. సమగ్రమైన, ఉభయ పక్షాలకు ప్రయోజనకరమైన ఒప్పందం కోసం అధికారికంగా చర్చలను ప్రారంభించే దిశగా ఇదొక కీలకమైన ముందడుగు. ఇరు పక్షాలకు చెందిన ప్రత్యేక ప్రతినిధి బృందాలు, ప్రతినిధుల సమక్షంలో ఈ సంతకాలు జరిగాయి.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీ పీయూష్ గోయల్ మాట్లాడుతూ, ఈ ఉమ్మడి ప్రకటనతోపాటు 2026 ఫిబ్రవరి 5న సంతకం చేసిన ఎఫ్‌టీఏ నిబంధనలు (టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్).. భారత్, జీసీసీ దేశాల మధ్య సంబంధాల్లో ఒక కీలక మైలురాయిగా పేర్కొన్నారు. ఉమ్మడి చరిత్ర, సాంస్కృతిక బంధాలతో పెనవేసుకుపోయిన ఈ సంబంధం.. విస్తృతమైన, ఉభయ పక్షాలకు ప్రయోజనకరమైన ఈ ఎఫ్‌టీఏ ద్వారా మరింత ఉత్తేజితమవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో.. పరస్పర సమన్వయం, సహకారాన్ని పెంపొందించే బలమైన వాణిజ్య ఒప్పందంపై చర్చలను ప్రారంభించడం అత్యంత సమయోచితమని స్పష్టం చేశారు.

గౌరవనీయులు జాసెమ్ మహమ్మద్ అల్బుదైవీ మాట్లాడుతూ, వాణిజ్య రంగంలో ముందస్తుగా అంచనా వేయగల వాతావరణాన్నీ, స్థిరత్వాన్నీ నెలకొల్పడం ద్వారా.. భారత్, జీసీసీ దేశాల మధ్య వాణిజ్య, పెట్టుబడి సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ముఖ్య సాధనంగా ఉపయోగపడుతుందన్నారు.

భారతదేశానికి వర్తక వాణిజ్య రంగాల్లో సుదీర్ఘ చారిత్రక సంబంధాలున్న ముఖ్యమైన ప్రాంతంతో వాణిజ్యాన్ని మరింత విస్తరించుకోవడానికీ, కొత్త అవకాశాలను అన్వేషించడానికీ ఈ ఎఫ్‌టీఏ అనేక అవకాశాలను అందిస్తుంది. భారత్‌కు జీసీసీ అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ద్వైపాక్షిక వాణిజ్యం 178.56 బిలియన్ డాలర్లకు చేరుకుంది (ఎగుమతులు: 56.87 బిలియన్ డాలర్లు, దిగుమతులు: 121.68 బిలియన్ డాలర్లు). దేశ మొత్తం అంతర్జాతీయ వాణిజ్యంలో ఇది 15.42 శాతానికి సమానం. గత అయిదేళ్లలో జీసీసీతో భారత వాణిజ్యం క్రమంగా విస్తరిస్తూ, 15.3 శాతం వార్షిక సగటు వృద్ధి రేటును నమోదు చేసింది.

భారత్ నుంచి జీసీసీ దేశాలకు జరిగే ప్రధాన ఎగుమతుల్లో ఇంజినీరింగ్ వస్తువులు, బియ్యం, వస్త్రాలు, యంత్రాలు, రత్నాలు, ఆభరణాలు ఉన్నాయి. అలాగే జీసీసీ నుంచి భారత్ దిగుమతి చేసుకునే ప్రధాన ఉత్పత్తుల్లో ముడి చమురు, ఎల్ఎన్‌జీ, పెట్రోకెమికల్స్, బంగారం వంటి విలువైన లోహాలు ముఖ్యమైనవి. మొత్తంగా చూస్తే, 61.5 మిలియన్ల జనాభా (2024 లెక్కల ప్రకారం), ప్రస్తుత ధరల ప్రకారం 2.3 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో.. ఈ విభాగంలో జీసీసీ దేశాలు ప్రపంచవ్యాప్తంగా తొమ్మిదో స్థానంలో ఉన్నాయి. భారత్‌కు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరంగా కూడా జీసీసీ దేశాలు కీలక వనరుగా ఉన్నాయి. 2025 సెప్టెంబరు నాటికి అక్కడి నుంచి వచ్చిన మొత్తం పెట్టుబడులు 31.14 బిలియన్ డాలర్లను దాటాయి.

దాదాపు కోటి మంది భారతీయులు జీసీసీ దేశాల్లో ఉన్నారు. వీరు ఇరు ప్రాంతాల మధ్య ఒక సజీవ వారధి. ప్రజల మధ్య ఈ బలమైన, శాశ్వతమైన అనుబంధమే భారత్, జీసీసీ దేశాల మధ్య సంబంధాలకు పునాదిగా నిలుస్తోంది. ఆ ప్రాంతంలో భారతీయ కంపెనీలు భారీ స్థాయిలో విస్తరిస్తే ఈ సంబంధాలు మరింత బలోపేతమవుతాయి.

భారత్, జీసీసీ దేశాల మధ్య ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం.. సంతకాలు పూర్తయిన తర్వాత ఇరుపక్షాల మధ్య వాణిజ్య అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు మార్గం సుగమం చేస్తుందని ఆశాభావం వ్యక్తమవుతోంది. ఇది ప్రపంచ శ్రేయస్సు కోసం ఒక గొప్ప చోదక శక్తిగా నిలుస్తుంది. దీనివల్ల ఎగుమతుల విస్తరణ, కొత్త రకాల వస్తువుల ఎగుమతులకు అవకాశం లభిస్తుంది. ఫలితంగా ఇరు దేశాల మధ్య ఆర్థిక అనుబంధం మరింత బలోపేతమవుతుంది.

# నకిలీ ఐఎస్ఐ మార్క్‌తో విద్యుత్ కేబుళ్ల తయారీ.. బీఐఎస్ అధికారుల దాడి!

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 26:నకిలీ ఐఎస్ఐ మార్కుతో విద్యుత్ వైర్లు, కేబుళ్లు తయారు చేస్తున్న ఓ పరిశ్రమలో భారతీయ ప్రమాణాల బ్యూరో (ఃఎా), హైదరాబాద్ శాఖ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. చర్లపల్లి పారిశ్రామిక వాడలో ఉన్న ఓ పరిశ్రమలో కొన్నేళ్లుగా బీఐఎస్ అనుమతి లేకుండా కేబుళ్లను తయారీ చేయడంతో పాటు నకిలీ ఐఎస్ఐ ముద్రలు, లైసెన్సు నెంబర్లతో ఉత్పత్తులు సరఫరా చేస్తున్నారన్న సమాచారంతో అధికారులు దాడులు నిర్వహించారు. బీఐఎస్ డైరెక్టర్, శాఖాధిపతి పీవీ శ్రీకాంత్ ఆదేశాలతో.. డైరెక్టర్ తన్నీరు రాకేశ్ నేతృత్వంలోని అధికారుల బృందం చేసిన ఈ తనిఖీల్లో వివిధ బ్రాండ్లకు చెందిన 200కుపైగా పీవీసీ ఇన్సులేటెడ్ విద్యుత్ వైర్లు, కేబుళ్లు నకిలీ ఐఎస్ఐ మార్క్‌తో నిల్వ ఉంచి విక్రయానికి సిద్ధం చేసినట్లు గుర్తించారు. గృహ వినియోగానికి సంబంధించిన విద్యుత్ ఉత్పత్తులన్నీ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన క్వాలిటీ కంట్రోల్ ఆర్డర్ల (ఖఅాబ) పరిధిలోకి వస్తాయి. వీటన్నింటికీ బీఐఎస్ అనుమతి, ఐఎస్ఐ మార్కు తప్పనిసరి. అయితే, సంబంధిత పరిశ్రమ నిర్వాహకులు బీఐఎస్ నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండానే నకిలీ ఐఎస్ఐ మార్కు, లైసెన్సు నెంబరును వినియోగించి బీఐఎస్ చట్టం-2016లోని సెక్షన్ 17ను ఉల్లంఘించినట్లు అధికారులు పేర్కొన్నారు. నకిలీ ఐఎస్ఐ ముద్ర ఉన్న డబ్బాలతో పాటు, రూ.5లక్షల విలువైన కేబుళ్లనూ జప్తు చేసినట్లు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన క్వాలిటీ కంట్రోల్ ఆర్డర్ల పరిధిలోకి వచ్చే ఉత్పత్తులను బీఐఎస్ ధృవీకరణ లేకుండా తయారు చేయడం, దిగుమతి చేసుకోవడం, నిల్వ చేయడం లేదా విక్రయించడం నిషేధం. ఇందులో తొలి ఉల్లంఘనకు రెండేళ్ల వరకు జైలు శిక్ష లేదా కనీసం రూ.2 లక్షల జరిమానా, తదుపరి ఉల్లంఘనలకు కనీసం రూ.5 లక్షల జరిమానా లేదా వస్తువుల విలువకు పదిరెట్ల వరకూ జరిమానా విధించే అవకాశం ఉందని.. నిందితులపై చట్టపరమైన చర్యలు చేపడతామని అధికారులు స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా బీఐఎస్ హైదరాబాద్ శాఖాధిపతి పీవీ శ్రీకాంత్ మాట్లాడుతూ.. వినియోగదారుల అప్రమత్తతోనే నకిలీని అరికట్టడం సాధ్యమవుతుందన్నారు. వస్తువులు కొనేముందు ఐఎస్ఐ ముద్ర నిజమైనదో కాదో బీఐఎస్ కేర్ యాప్ ద్వారా పరిశీలించాలని కోరారు. ఒకవేళ ఐఎస్ఐ ముద్ర నకిలీదని తేలినా, నాణ్యత సరిగా లేకపోయినా అదే యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని తెలిపారు. బంగారు ఆభరణాల శుద్ధతనూ, హాల్‌మార్కింగ్ వివరాలతో పాటు ఎలక్ట్రానిక్ ఉపకరణాల నాణ్యత వివరాలనూ ఈ యాప్ ద్వారా సరిచూసుకోవచ్చన్నారు. తయారీదారులు బీఐఎస్ ధ్రువీకరణ లేకుండా ఉత్పత్తులు తయారు చేసినా, దిగుమతి చేసుకున్నా, విక్రయించినా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

# బ్లాక్‌చైన్ ఆధారిత డిజిటల్ గవర్నెన్స్ పరిష్కారాలను ప్రోత్సహించడానికి బ్లాక్‌చైన్ ఇండియా చాలెంజిని ప్రారంభించిన ఎంఈఐటీవై



న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 26:'బ్లాక్‌చైన్ ఇండియా చాలెంజి'ని ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక విజ్ఞాన మంత్రిత్వ శాఖ (ఎంఈఐటీవై) కార్యదర్శి శ్రీ ఎస్. కృష్ణన్ ఐఏఎస్ 2026 ఫిబ్రవరి 23న న్యూఢిల్లీలోని ఎంఈఐటీవైలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఐటీవై అదనపు కార్యదర్శి శ్రీ అభిషేక్ సింగ్, ఎంఈఐటీవై సంయుక్త కార్యదర్శి శ్రీ సుదీప్ శ్రీవాస్తవ, ఎంఈఐటీవై గ్రూప్ కోఆర్డినేటర్లు శ్రీమతి సునీతా వర్మ, శ్రీ మనోజ్ కుమార్ జైన్, సైంటిస్ట్ జీ, ఎంఈఐటీవై, సీ-డీఏసీ హైదరాబాద్ సెంటర్ హెడ్ శ్రీమతి పి. ఆర్. లక్ష్మీ ఈశ్వరిలతో పాటు ఎంఈఐటీవై, సీ-డీఏసీలకు చెందిన ఇతర అధికారులు పాల్గొన్నారు. వేర్వేరు ప్రభుత్వ విభాగాలతో పాటు అంకుర సంస్థలు కూడా ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నాయి.

ఈ చాలెంజిని ఎంఈఐటీవై సహకారంతో సీ-డీఏసీ ద్వారా అమలు చేస్తున్నారు. బ్లాక్‌చైన్ ఇండియా చాలెంజి జాతీయ స్థాయిలో చేపడుతున్న కార్యక్రమం. అత్యాధునిక బ్లాక్‌చైన్ ఆధారిత డిజిటల్ గవర్నెన్స్ పరిష్కారాల్ని ఆవిష్కరించడంతో పాటు, వాటిని పరీక్షించి చూడటానికి భారతీయ అంకుర సంస్థల్ని ప్రోత్సహించడం ఈ చాలెంజి ఉద్దేశం. ప్రభుత్వ యూజ్ కేసుల కోసం రెగ్యులేటరీ కంట్రోలుతో పాటు, విశ్వసనీయమైన, ఆడిట్‌కు అనువైన, జోక్యం చేసుకోవడానికి వీలు ఉండని రీతిలో భద్రతను కల్పించడానికి ప్రాధాన్యాన్ని ఇస్తూ, అనుమతి ఆధారిత బ్లాక్‌చైన్ పరిష్కారాల్ని రూపొందించడం కూడా బ్లాక్‌చైన్ ఇండియా చాలెంజి లక్ష్యాలే. ఎలక్ట్రానిక్ మాధ్యమంలో సేకరణ (ఇ-ప్రొక్యూర్‌మెంట్), సరఫరా వ్యవస్థ నిర్వహణ, ప్రజా పంపిణీ వ్యవస్థ, విద్య, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, విద్యుత్తు, ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), భూమి రికార్డులు, పర్యావరణం, స్థిరత్వం వంటి కీలక రంగాల్లో కీలక పాలన, సేవల అందజేతలలో ఎదురవుతున్న సవాళ్లపై బ్లాక్‌చైన్ ఇండియా చాలెంజిలో ప్రత్యేకంగా దృష్టి పెడతారు. ఈ రంగాలు సూచనప్రాయమైనవి మాత్రమే.. వీటి విషయంలో పరిమితులేవీ లేవు. ప్రస్తావిత రంగాలకు అదనంగా ఇతరత్రా కూడా ప్రభావవంతమైన పరిష్కారాలను ప్రభుత్వ విభాగాల సహకారంతో అంకుర సంస్థలు ప్రతిపాదించేందుకు వీలు ఉంది.

సభను ఉద్దేశించి ఎంఈఐటీవై కార్యదర్శి మాట్లాడుతూ, బ్లాక్‌చైన్ ప్రభుత్వ సేవల్లో కీలక పాత్రను పోషిస్తుందనీ, ప్రమాణీకరణ యోగ్యతల్ని నిర్ధారించడంతో పాటు అనేక మూలాల నుంచి అందే సమాచారాన్ని ఒకే మూలం ద్వారా విశ్వసనీయంగా మారుస్తుందన్నారు. దీంతో పారదర్శకత్వంతో పాటు సామర్థ్యం కూడా పెరుగుతుందని తెలిపారు. గుర్తించిన 10 యూజ్ కేస్ కేటగిరీలకు అదనంగా, ప్రభుత్వ విభాగాలకు సంబంధించిన ఏదైనా ఇతర ప్రభావవంతమైన యూజ్ కేసును అంకుర సంస్థలు వెతకవచ్చని ఆయన చెప్పారు. అంకుర సంస్థల సముదాయంలో బ్లాక్‌చైన్ ఇండియా చాలెంజిని విస్తృతంగా వ్యాప్తి చేయడం కోసం పని చేయాల్సిందిగాను, ప్రభుత్వ విభాగాల్లో ఆచరణీయ పద్ధతుల్లో వినియోగించదగిన యూజ్ కేసులను రూపొం దించాల్సిందిగాను సీ-డీఏసీ, ఎంఈఐటీవై బృందాలకు ఆయన సూచించారు. ఆయా యూజ్ కేసుల్ని తరువాత భారత్ అంతటా అమలుపరిచేందుకు అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు.

ఈ చాలెంజిలో భాగంగా, డీపీఐఐటీ గుర్తించిన అంకుర సంస్థలకు ప్రభుత్వ విభాగాల సహకారంతో తమ ఆలోచనలను వాస్తవిక, ప్రభావవంతమైన పరిష్కారాలుగా మార్చడానికి అవకాశం లభిస్తుంది. ఎంపికైన అంకుర సంస్థలకు ప్రభుత్వ విభాగాల కోసం 10 వేర్వేరు కేటగిరీల పరిధిలో 10 ప్రభావవంతమైన బ్లాక్‌చైన్ ఆధారిత యూజ్ కేసులను అభివృద్ధిపరచడానికి దశలవారీగా ఆర్థిక సహాయాన్ని అందిస్తారు.

బ్లాక్‌చైన్ ఇండియా చాలెంజిలో పాల్గొని ప్రభుత్వ విభాగాల సహకారంతో, ఎంపిక చేసిన సేవల రంగాల్ని దృష్టిలో పెట్టుకొని పరిష్కారాలను కనుగొనడానికి నవకల్పనసహిత ఆలోచనలతో ముందుకు రావాల్సిందిగా అర్హత గల అంకుర సంస్థలను ఆహ్వానిస్తున్నారు. బ్లాక్‌చైన్ ఇండియా చాలెంజికి సంబంధించిన తాజా సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందుకోవడానికి పేర్లను వెంటనే నమోదు చేసుకోవాల్సిందిగా అంకుర సంస్థలను కోరుతున్నారు.

అర్హత ప్రమాణాలు, నమోదు ప్రక్రియ, ఉపయోగానికి సంబంధించిన ఉదాహరణలు, మార్గదర్శక సూత్రాలు, మేధా సంపత్తి హక్కుల (ఐపీఆర్)తో పాటు ఇతర సంబంధిత వివరాలను తెలుసు కోవడానికి అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

# మహాత్మాగాంధీ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ కె.అంజిరెడ్డి

రామగిరి, ఫిబ్రవరి 26 : నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ కొప్పుల అంజిరెడ్డి నియమితులయ్యారు. వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తా హుస్సేన్ గురువారం నియామక పత్రం అందజేశారు. అంజిరెడ్డి ప్రస్తుతం యూనివర్సిటీలో సోషల్ సైన్స్ విభాగం డీన్ గా, ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ గా పని చేస్తున్నారు. ఇప్పటివరకు ఆయన యూనివర్సిటీలో పరీక్షల కంట్రోలర్‌గా, ఆడిట్ సెల్ డైరెక్టర్‌గా, వీసీ ఓఎస్డీగా వివిధ హోదాల్లో పని చేశారు. రిజిస్ట్రార్‌గా నియామకమైన ఆయనకు వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అంజిరెడ్డి స్వస్థలం యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు.ఎస్ మండలం సింగారం గ్రామం.

# రాష్ట్రస్థాయి భౌతిక శాస్త్ర ప్రతిభా పోటీల్లో సత్తాచాటిన విద్యార్థిని

మెదక్, ఫిబ్రవరి 26: హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి భౌతిక శాస్త్ర ప్రతిభా పోటీల్లో సిద్దిపేట జిల్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాంసాగర్ విద్యార్థిని కుమారి శ్రీనిధి సత్తా చాటింది . ఎస్‌సీఈఆర్‌టీ , ఫిజికల్ సైన్స్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించగా వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ పోటీలో సత్తా చాటి రాష్ట్రస్థాయిలో తృతీయ బహుమతిని కైవసం చేసుకున్న శ్రీనిధిని , గైడ్ టీచర్ నరేందర్ రెడ్డిని ప్రధానోపాధ్యాయులు రాజ్ కుమార్ అభినందించారు. అరుదైన విజయం పట్ల ఉపాధ్యాయులు యాదయ్య, నవీన్ కుమార్ , మహేష్ కుమార్ ,శ్యామ్ సుందర్ శర్మ, మంజుల , సుజాత , ఉమారాణి , పీఈటీ అనీఫ్, సీఆర్‌పీ స్వామి గౌడ్ అభినందించారు.

# భద్రాద్రి కొత్తగూడెంలో భారీగా గంజాయి స్వాధీనం – నలుగురు నిందితుల అరెస్ట్

ఖమ్మం, ఫిబ్రవరి 26: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు భారీ ఆపరేషన్ నిర్వహించి నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. సుమారు రూ.2.4 కోట్ల విలువైన 80 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని రవాణాకు ఉపయోగించిన వాహనాన్ని పోలీసులు సీజ్ చేశారు.

నిందితులను నాగరాజు, మురళీధర్, తిరుపతి, ఎండ్ల రాము గా గుర్తించారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజ్ మాట్లాడుతూ.. జిల్లాలో మత్తు పదార్థాల రవాణాపై కఠిన చర్యలు కొనసాగుతాయన్నారు. యువత భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక పోలీస్ సిబ్బంది పనిచేస్తున్నట్లు చెప్పారు.

ప్రజలు అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో డీఎస్పీ ఆదినారాయణ, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, చెన్నూరి శ్రీనివాసరావు, ఎస్ఐ రవి, రమాకాంత్ పాల్గొన్నారు.

# హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన చాహత్ బాజ్ పాయ్



హన్మకొండ, ఫిబ్రవరి 26: హనుమకొండ జిల్లా నూతన కలెక్టర్ గా చాహత్ బాజ్ పాయ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చాహత్ బాజ్ పాయ్ ను కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, పలువురు జిల్లా అధికారులు, తహసిల్దార్లు నూతన కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు, పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. బాధ్యతలు స్వీకరించేందుకు కలెక్టరేట్ ప్రాంగణానికి చేరుకున్న జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ కి అదనపు కలెక్టర్, అధికారులు ఘనంగా స్వాగతం పలికి పూల మొక్కలు, పుష్పగుచ్చాలను అందించారు. జిల్లా కలెక్టర్ గా కలెక్టర్ ఛాంబర్ లో బాధ్యతలు స్వీకరించారు.హనుమకొండ జిల్లా కలెక్టర్ గా పని చేసిన స్నేహ శబరీష్ బదిలీపై మహబూబాబాద్ జిల్లాకు కలెక్టర్ గా వెళ్ళగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా ఉన్న చాహత్ బాజ్ పాయ్ హనుమకొండ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు.

# డిజిలాకర్ నియంత్రణ సమన్వయానికి ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 26:డిజిలాకర్ నియంత్రణలను సమన్వయం చేయడానికి అత్యున్నత స్థాయి కమిటీని ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసింది. ప్రస్తుత సాంకేతిక, చట్టపరమైన పరిస్థితులకు అనుగుణంగా డిజిటల్ లాకర్ నియమాలను న్యాయపరంగా సమీక్షించడం, ఎంటిటీ లాకర్, డిజిటల్ లాకర్ వ్యవస్థ విస్తరణకు, వాణిజ్యీకరణకు భవిష్యత్తు ప్రణాళికను రూపొందించడం ఈ కమిటీ విధుల్లో భాగంగా ఉన్నాయి.

ఈ కమిటీకి ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి శ్రీ అజయ్ సాహ్నీ నేతృత్వం వహిస్తారు. న్యాయ నిపుణులు, సాంకేతిక నిపుణులు, పారిశ్రామిక ప్రతినిధులు దీనిలో సభ్యులుగా ఉంటారు.న్యూఢిల్లీలోని సీజీవో కాంప్లెక్స్‌లో ఉన్న ఎలక్ట్రానిక్స్ నికేతన్ వద్ద 2026, ఫిబ్రవరి 24న కమిటీ మొదటి సమావేశం జరిగింది. పౌరులకు జీవన సౌలభ్యాన్ని, సంస్థలకు వ్యాపార సౌలభ్యాన్ని పెంపొందించడం ద్వారా వికసిత్ భారత్ లక్ష్యాలను సాధించడంలో డిజిటల్ లాకర్ వ్యవస్థ దృక్పథంపై, పోషించే పాత్రపై కమిటీ సభ్యులు చర్చించారు.

# గోదావరిఖనిలో జాతీయ స్థాయి నృత్య పోటీలు, ఉగాది పురస్కారాలు..



కరీంనగర్, ఫిబ్రవరి 26: తారా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మార్చి 28, 29 తేదీలలో గోదావరిఖనిలో రెండు రోజులపాటు జాతీయస్థాయి నృత్య పోటీలు, ఉగాది పురస్కారాలు, నల్ల వజ్రం అవార్డ్స్ ఫంక్షన్ ఘనంగా నిర్వహించనున్నట్లు అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు సంకె రాజేష్, ఇప్టా( జాతీయ సమితి నాయకుడు కే స్వామి తెలిపారు.

గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. తారా ఆర్ట్స్ అకాడెమీ ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటుగా ఉత్తరాఖండ్, తమిళనాడు, అండమాన్ నికోబార్, అమెరికా, మలేషియా, సింగపూర్, స్విట్జర్లాండ్, తైవాన్ తదితర దేశాలలో సైతం కళోత్సవాలు నిర్వహించి, వివిధ రంగాలలో లబ్ద ప్రతిష్టులైన వారిని సముచిత రీతిన సత్కరించడం జరిగిందన్నారు. గోదావరిఖని కేంద్రంగా 2021లో భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు శతజయంతి ఉత్సవాలు, ఆజాదీకా అమృత్ మహోత్సవ్, 2024లో విభిన్న రంగాలలో రాణిస్తున్న సుమారు 125 మంది సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబాల పిల్లలను గుర్తించి, నల్ల వజ్రం జాతీయ పురస్కారాలను అందజేయడం జరిగిందన్నారు.

ఈ సంవత్సరం ఉగాదిని పురస్కరించుకొని మార్చి 28, 29 తేదీలలో గోదావరిఖని ఆర్కే గార్డెన్స్ లో ఉగాది ఉత్సవాలు, జాతీయస్థాయి జానపద, శాస్త్రీయ బృంద నృత్యాల పోటీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు నగదు బహుమతితో పాటు జ్ఞాపికలు, సర్టిఫికెట్లతో సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే విద్య, వైద్యం, పాత్రికేయ, న్యాయవాద, ఉపాధ్యాయ, ఉద్యోగులు, అధికారులు తదితర రంగాలలో రాణిస్తున్న వారిని గుర్తించి ఉగాది పురస్కారాలు, నల్ల వజ్రం అవార్డులు ఇవ్వడం జరుగుతుందని అన్నారు.

ఈ కార్యక్రమానికి పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, సినీ, టీవీ నటీనటులను అతిథులుగా ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. నృత్య పోటీలలో పాల్గొనదలచిన కళాకారులు మార్చి 10లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 6281252369 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు. ఇంకా ఈ విలేకరుల సమావేశంలో కళోత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులు దామెర శంకర్, మేజిక్ రాజా, దయా నర్సింగ్, కనకం రమణయ్య, వి.చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

# వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ నుంచి తప్పుకుంటున్నా.. ప్రకటించిన సీఈవో

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 26: వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సీఈవో బోర్జ్ బ్రెండె తన పదవి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. అమెరికా ఫైనాన్సియర్, సెక్స్ నేరస్థుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో లింకున్న కేసులో దర్యాప్తు చేపట్టిన నేపథ్యంలో ఆయన తన పదవి నుంచి వైదొలుగుతున్నట్లు వెల్లడించారు. ఎప్‌స్టీన్‌తో మూడు సార్లు బిజినెస్ డిన్నర్‌లో బోర్జ్ బ్రెండె పాల్గొన్నట్లు ఫైల్స్ ద్వారా తెలిసింది. మెయిల్, టెక్స్ట్ మెసేజ్‌ల ద్వారా ఎప్‌స్టీన్‌తో కమ్యూనికేషన్ నిర్వహించినట్లు బోర్జ్‌పై ఆరోపణలు ఉన్నాయి.

సునితమైన పరిశీలిన తర్వాత.. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సీఈవో, ప్రెసిడెంట్ హోదాల నుంచి తప్పుకోవాలని నిర్ణయించానని, సుమారు ఎనిమిదిన్నర ఏళ్ల పాటు సేవలు అందించినట్లు తన ప్రకటనలో బోర్జ్ పేర్కొన్నారు. అయితే తన ప్రకటనలో ఎప్‌స్టీన్‌తో లింకు గురించి ఎటువంటి ప్రస్తావన చేయలేదు. ఎటువంటి అవరోధాలు లేకుండా సంస్థ పనులు కొనసాగాలని భావిస్తున్నట్లు తన లేఖలో చెప్పారు.

గతంలో నార్వే ప్రభుత్వంలో ఆయన అనేక సీనియర్ పదవులను నిర్వర్తించారు.

# తాము అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతులను స్థానిక భాషల్లోనే పంచుకొనే అవకాశాన్ని గ్రామాలకు అందించిన 'సుజల్ గ్రామ్ సంవాద్'

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 26:నీటి నిర్వహణలో సామాజిక భాగస్వామ్యానికి, సమాజ నేతృత్వంలో జల్ జీవన్ మిషన్ (జేజేఎం) అమలులో భారత ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ.. 'సుజల్ గ్రామ్ సంవాద్' నాలుగో సంచికను కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని తాగునీరు, పారిశుధ్య విభాగం (డీడీడబ్ల్యూఎస్) విజయవంతంగా నిర్వహించింది.

వర్చువల్ విధానంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రతినిధులు, గ్రామీణ నీటి-పారిశుధ్య కమిటీ (వీడబ్ల్యూఎస్‌సీ) సభ్యులు, పౌరులు, మహిళా ఎస్‌హెచ్‌జీలు, విద్యార్థులు, క్షేత్ర స్థాయి కార్యకర్తలు పాల్గొన్నారు. వీరితో పాటుగా జేజేఎం మిషన్ డైరెక్టర్లు, జిల్లా కలెక్టర్లు/జిల్లా మెజిస్ట్రేట్లు/డిప్యూటీ కమిషనర్లు, డీడబ్ల్యూఎస్ఎం అధికారులు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సుజల్ గ్రామ సంవాద్ నాలుగో సంచికలో భాగంగా 6 గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గ్రామస్థాయి చర్చలు జరిగాయి. ఈ కార్యక్రమంలో నమోదు చేసుకున్న 2,000 మంది పాల్గొన్నారు. ఇది సమాజం, అధికారులకు ఉన్న దృఢ నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. అలాగే గ్రామ పంచాయతీ స్థాయిలో మహిళలు, చిన్నారులు, యువత, వృద్ధులతో సహా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దీంతో నమోదు చేసుకున్న వారి సంఖ్య కంటే ఎక్కువ సామూహిక భాగస్వామ్యం కనిపించింది.

దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి మౌలిక వసతుల కల్పనపై జేజేఎం దృష్టి సారించిందని డీడీడబ్ల్యూఎస్ కార్యదర్శి శ్రీ అశోక్ కేకే మీనా అన్నారు. ఈ వ్యవస్థలు స్థిరంగా కొనసాగేలా చూడటమే అత్యంత కీలకమన్నారు. మౌలిక వసతులను ఏర్పాటు చేసిన అనంతరం, సమర్థవైన కార్యకలాపాలు, నిర్వహణ వ్యవస్థల ద్వారా క్రమం తప్పకుండా గృహాలకు తాగునీటిని సరఫరా చేయడంలోనే అసలైన బాధ్యత ఉందన్నారు. అలాగే స్థిరంగా సేవలను అందించడమే కేంద్రీయ ప్రాధాన్యం కావాలని తెలియజేశారు.

నీటి సరఫరా నిర్వహణ ప్రాథమికంగా స్థానిక సంస్థల బాధ్యత అని ఆయన తెలిపారు. పథకాల అమలులో గ్రామ పంచాయతీలు, వీడబ్ల్యూఎస్‌సీలు పోషించే కీలకపాత్ర గురించి కూడా ఆయన వివరించారు. భవిష్యత్తులో నీటి సరఫరా వ్యవస్థల బాధ్యతను గ్రామపంచాయతీలకు ఇవ్వడంపై ప్రధాన దృష్టి సారిస్తున్నామని, తద్వారా నిర్వహణ, నియంత్రణలో వాటికి పూర్తి అధికారం లభిస్తుందన్నారు. ఈ పరివర్తనకు అవసరమైన సాంకేతిక, నిర్వహణ సహకారాన్ని అందించడానికి జిల్లా సాంకేతిక విభాగం (డీటీయూ)తో సహా ఇతర సంస్థాగత వ్యవస్థలను బలోపేతం చేస్తామని ఆయన వివరించారు.

జల్ సేవా ఆంకలన్ ద్వారా పారదర్శకంగా, జవాబుదారీతనంగా ఉండాల్సిన ప్రాధాన్యాన్ని ఆయన వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామపంచాయతీలు ఏటా గ్రామసభకు నీటి సేవల వివరాలను సమర్పిస్తాయి. ఈ కార్యక్రమాన్ని ఇప్పటికే పెద్ద సంఖ్యలో గ్రామపంచాయతీలు పూర్తి చేశాయని, మిగిలినవి సైతం త్వరలోనే దీన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

మార్చి 8 నుంచి 22 వరకు జాతీయ స్థాయి జల్ మహోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వెల్లడించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంతో మొదలై.. ప్రపంచ జల దినోత్సవంతో ఈ కార్యక్రమం ముగుస్తుంది. ఈ కార్యక్రమంలో దృష్టి సారించే విషయాలు:

ఉత్తర త్రిపురలోని పశ్చిమ దామ్‌చెరా ప్రజలతో సంభాషణ ద్వారా సంవాద్ ప్రారంభమైంది. వీడబ్ల్యూఎస్‌సీ సభ్యులు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీలు, పంప్ ఆపరేటర్లు, ఎఫ్‌టీకే- శిక్షణ పొందిన మహిళలు, ఇతర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బెంగాలీలో తమ అనుభవాలను పంచుకున్నారు. జేజేఎం అమలుకు ముందు వాగులు, సీజనల్ నీటి వనరుల నుంచి శుద్ధి చేయని నీటిపై ఆధారపడాల్సి వచ్చేదని, దానివల్ల నీటికొరతను, నీటి ద్వారా వచ్చే వ్యాధులను ఎదుర్కోవాల్సి వచ్చేదన్నారు.

జేజేఎం ద్వారా ఇంటింటికీ కుళాయి సౌకర్యాన్ని కల్పించడంతో తమ దైనందిన జీవితం గణనీయంగా మెరుగుపడిందని తెలిపారు. ముఖ్యంగా మహిళలు నీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తప్పిందన్నారు. తరచూ నీటి నాణ్యతా పరీక్షలతో పాటు క్రమం తప్పకుండా స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయడం వల్ల బాలల్లో డయేరియా, తదితర వ్యాధులు గణనీయంగా తగ్గాయని వెల్లడించారు.

అలాగే జల్ సేవా ఆంకలన్ కూడా పూర్తయిందని వారు తెలియజేశారు. పైపులైన్ల లీకేజీలను సాంకేతిక బృందం తక్షణమే పరిష్కరించి, జాప్యం లేకుండా సాధారణ నీటి సరఫరాను పునరుద్ధరిస్తోందని, ఇది స్థానిక నిర్వహణ, పర్యవేక్షణ వ్యవస్థ సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తుందని తెలిపారు.

అలాగే ఇళ్లలో, సామూహిక ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి, సమర్థమైన మురుగు నీటి నిర్వహణ ద్వారా గ్రామీణ వాతావరణం స్వచ్ఛంగా మారుతోందన్నారు.

సెడెరాపేట కమ్యూనిటీ సభ్యులు డీడీడబ్ల్యూఎస్ అధికారులతో తమిళంలో మాట్లాడుతూ, 1,248 గృహాలకు, 6,700 మంది జనాభాకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు గృహాలకు తాగునీటి కనెక్షన్ (ఎఫ్‌హెచ్‌టీసీ)లు 100 శాతం అందించామని తెలిపారు. ఈ తాగునీటి సరఫరా వ్యవస్థ పూర్తిగా, సమర్థంగా పనిచేస్తోందని తెలిపారు.

నీటి మౌలిక వసతులను విస్తరిస్తూ 5,000 లీటర్ల సామర్థ్యమున్న ఓవర్ హెడ్ ట్యాంకును, ఏడు బోరుబావులను, 24 డిస్ట్రిబ్యూషన్ కనెక్షన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిరంతరాయంగా సేవలను అందించేందుకు క్రమం తప్పకుండా వీటిని పర్యవేక్షిస్తామని తెలిపారు. పంచాయతీ స్థాయిలో ప్రత్యేకంగా కేటాయించిన పంపు ఆపరేటర్లు వాటి దైనందిన కార్యకలాపాలను నిర్వహిస్తారు.

అన్ని గృహాలకు సురక్షితమైన తాగు నీరు అందుతుందని నిర్ధారించుకోవడానికి కాలానుగుణంగా నాణ్యత పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఫిర్యాదులను పరిష్కరించేందుకు ప్రత్యేక యంత్రాంగం కూడా ఉంది.

తెలంగాణలోని పులిమామిడి గ్రామానికి చెందిన రైతులు డీడీడబ్ల్యూఎస్ అధికారులతో తెలుగులో మాట్లాడారు. తమ గ్రామ పంచాయతీ పరిధిలోని అన్ని గృహాలు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు 100 శాతం కుళాయి కనెక్షన్ల ద్వారా సురక్షితమైన, నాణ్యమైన తాగు నీటిని నిరంతరం సరఫరా చేస్తున్నామని తెలిపారు. తమ గ్రామంలో జల్ అర్పణ్, జల్ సేవా ఆంకలన్ కార్యక్రమాలు రెండూ పూర్తయ్యాయని వెల్లడించారు. త్వరలో చేపట్టనున్న జల మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా జల అర్పణ్ ఉత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అలాగే బాలలకు మెరుగైన పారిశుధ్య సౌకర్యాలను కల్పిస్తూ.. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లోని టాయిలెట్లకు కుళాయి సౌకర్యం, హ్యాండ్ వాషింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామని చెప్పారు. అలాగే అందరికీ సురక్షితమైన తాగునీరు అందించేందుకు క్షేత్రస్థాయిలో క్రమం తప్పకుండా నాణ్యతా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జేజేఎం కింద చేపట్టిన పనులు తమ గ్రామంలో పూర్తయ్యాయని న్గోపోక్ గ్రామానికి చెందినవారు స్థానిక ఆది భాషలో డీవోడబ్ల్యూఆర్ అధికారులకు వివరించారు. గ్రావిటీ ఆధారిత నీటి సరఫరా వ్యవస్థ ద్వారా అయిదు గూడేల్లోని 330 గృహాలకు స్వచ్ఛమైన తాగు నీరు అందిస్తున్నామని తెలియజేశారు. ఈ జిల్లాలో 24చీ7 క్రమం తప్పకుండా, విశ్వసనీయంగా నీటిని అందించే మొదటి గ్రామ పంచాయతీగా న్గోపోక్ మారింది. ఉత్తమ పనితీరు కనబరిచే వీడబ్ల్యూఎస్‌సీ, శిక్షణ పొందిన 'నల్ జల్ మిత్ర'లు, నీటి నాణ్యతను పరీక్షలను నిర్వహించే నిపుణులైన పది మంది మహిళలతో చురుకైన సామాజిక భాగస్వామ్యం, నిర్వహణను ఈ పంచాయతీ తెలియజేసింది.

క్రమం తప్పకుండా ఐఈసీ కార్యకలాపాలను నిర్వహిస్తామని, రిజిస్టర్ల సక్రమంగా నిర్వహిస్తూ వినియోగ రుసుం వసూలు చేస్తామని, నీటి వ్యవస్థ సుస్థిరతకు హామీ ఇచ్చేలా ఇంటింటికీ అవగాహన కల్పిస్తామని వారు తెలియజేశారు. నిర్వహణ, పర్యవేక్షణ అవసరాల నిమిత్తం ప్రతి ఇంటికీ రూ.50 చొప్పున, వాణిజ్య సంస్థలకు రూ.200 చొప్పున నెలవారీ ఛార్జీలు విధించేందుకు గ్రామసభ ఆమోదం తెలిపింది. స్వచ్ఛతా శ్రమదాన్, నిల్వ ట్యాంకుల నిర్వహణ, నీటి వనరులన్న ప్రదేశాల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం విస్తృతంగా ఉంది. నీటి వ్యవస్థను పరిరక్షించడంలో, దీర్ఘకాల స్థిరత్వాన్ని అందించడంలో పంచాయతీ నిబద్ధత స్పష్టంగా కనిపిస్తోంది. నీటి శుద్ధి కేంద్రాలున్న ప్రదేశాల దగ్గర చెత్త వేస్తే జరిమానాలు విధించడం, వనరులను క్రమం తప్పకుండా పరిశీలించడం వంటి చర్యలు దీనికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

కొండ ప్రాంతాలు, ఎత్తయిన ప్రదేశాలకు నీటిని అందించడాన్ని సవాలుగా పరిగణిస్తారని మాతవార్ సర్పంచ్ ఇంగ్లీషులో చెప్పారు. జేజేఎంకు ముందు తమ గ్రామస్థులు, ముఖ్యంగా మహిళలు నదులు, బావుల నుంచి నీటిని తీసుకువచ్చేందుకు రోజుకు 1 నుంచి 3 గంటలు వెచ్చించేవారని, వేసవిలో తరచూ పొడవైన క్యూలో నిల్చొని ఎదురుచూసేవారని తెలియజేశారు. జేజేఎం ద్వారా గ్రావిటీ ఆధారిత పంపిణీ సౌకర్యాన్ని అందించేందుకు ఎత్తయిన స్టోరేజీ ట్యాంకులను నిర్మించామని, ప్రతి ఇంటికీ క్రమం తప్పకుండా తాగునీటిని అందిస్తున్నామని వివరించారు. శారీరక భారం తగ్గడం, సమయం ఆదా అవడం, గౌరవం, సౌలభ్యం పెరగడంతో సహా రోజువారీ జీవితంలో ముఖ్యంగా మహిళల జీవితాల్లో గణనీయమైన మెరుగుదల కనిపించిందన్నారు.

సేవల సరఫరాలో అంతర్భాగంగా నీటి నాణ్యత మారిందని ఆ గ్రామ నాయకులు తెలియజేశారు. ఏడాదిలో కనీసం మూడు సార్లు శిక్షణ పొందిన నలుగురు మహిళలు, ఆశాలు, అంగన్వాడీలు పరీక్షిస్తారని తెలిపారు. పంపిణీ నిర్వహణ, నాణ్యతా పర్యవేక్షణ, అవగాహన కార్యక్రమాలు, ఫిర్యాదు పరిష్కారంలో వీడబ్ల్యూఎస్‌సీ చురుకైన పాత్రను పోషిస్తోందని తెలియజేశారు.

లీకేజీల వంటి చిన్న సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకుంటామని, పెద్ద సమస్యలను పీహెచ్‌ఈడీ దృష్టికి తీసుకెళామని వివరించారు. ఇది దృఢమైన సామాజిక బాధ్యతను, సమర్థవంతమైన గ్రామీణ నీటి నిర్వహణ వ్యవస్థను ప్రతిబింబిస్తోంది.

# చర్యలు తీసుకోకుంటే హైదరాబాద్ దిగ్బంధం : మాజీ మంత్రి తలసాని




హైదరాబాద్, ఫిబ్రవరి 26:కుమ్మెర మల్లన్న జాతరలో రెండు నెలల చిన్నారి మృతికి కారణమైన వారిని శిక్షించాలని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం నాగర్ కర్నూల్ కేంద్రంలో కుమ్మెర బాధితుల పక్షాన చేపట్టిన దీక్ష శిబిరాన్ని సందర్శించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజులలో దోషులపై చర్యలు తీసుకోకుంటే హైదరాబాద్ ను దిగ్బంధం చేస్తామని , అవసరమైతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అభం శుభం తెలియని చిన్నారి మృతికి కారకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. నిందితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు అవుతున్న బడుగు బలహీన వర్గాల ప్రజల పట్ల కొనసాగుతున్న వివక్ష, దాడులు, దౌర్జన్యాలు, ఆలయాల్లో ప్రవేశంపై ఆంక్షలు కొనసాగడం బాధాకరమని అన్నారు.దేవుడిని దర్శించుకునే అర్హత బలహీన వర్గాలకు లేదా అని ప్రశ్నించారు. కుమ్మెర దోషులను రక్షించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

# కేంద్రమంత్రిని కలిసిన ఎంపీ సురేష్

**-నూతన రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి**

ఆదిలాబాద్, ఫిబ్రవరి 26:: కొత్త జాతీయ రహదారులతోపాటు, బ్రిడ్జిల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని జహీరాబాద్ పార్లమెంటు సభ్యులు సురేష్ కోరారు. దేశ రాజధాని ఢిల్లీలో కేంద్ర రవాణా జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ కలిసి వినతి పత్రం అందజేశారు. జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని కామారెడ్డి ,సంగారెడ్డి జిల్లాలో వివిధ రహదారులపై కొత్త జాతీయ రహదారుల ఏరాదీనికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. పలు జాతీయ రహదారుల వద్ద సర్వీస్ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరగా త్వరలో మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు.

# రిజర్వాయర్‌లోకి దూసుకెళ్లిన కారు..

**-దేశాయి తండా సమీపంలో ఘోర ప్రమాదం..**
**-యువకుడు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు**

జనగామ, ఫిబ్రవరి 26: ప్రాంతంలో గురువారం విషాదకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్టేషన్ ఘన్‌పూర్ నుండి చిలుపూర్ మండలం దేశాయి తండా వైపు వెళ్తున్న షిఫ్ట్ కారు అదుపుతప్పి రిజర్వాయర్‌లోకి దూసుకెళ్లింది. స్థానికుల సమాచారం ప్రకారం కారు పల్టీలు కొట్టుకుంటూ రిజర్వాయర్‌లో పడినట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో కారు అద్దాలు పగలడంతో ధారావత్ చరణ్ (18) తీవ్ర గాయాలపాలయ్యాడు. అతను కారు నుంచి బయటపడి గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్నట్లు సమాచారం. వెంటనే స్థానికులు అతన్ని సమీప ఆసుపత్రికి తరలించారు.

అయితే కారు నడుపుతున్న భూక్యా పవన్ ఆచూకీ తొలుత తెలియకపోవడంతో సమాచారం అందుకున్న పోలీస్ సిబ్బందితో కలిసి ఎస్ఐ రాజేష్ ఘటన స్థలానికి చేరుకుని రిజర్వాయర్‌లో గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం చేపట్టిన శోధనలో భూక్యా పవన్ మృత దేహం లభ్యమైంది. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ దుర్ఘటనతో దేశాయి తండా పరిసర ప్రాంతాల్లో విషాద ఛాయలు కమ్ముకున్నాయి.

# నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 26:రానున్న వేసవి కాలంలో నీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ గంగుల సంతోష్ కుమార్ ఆదేశించారు. గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలని సూచించారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక వాహనం యాప్ ద్వారా ఇసుక సరఫరా అయ్యేలా చూడాలన్నారు.

అభివృద్ధి వేగం చేసేందుకు గాను వంద శాతం పన్నులు వసూలు దిశగా కార్యదర్శులు పని చేయాలని తెలిపారు. ఉపాధి హామీ పనులను గుర్తించి పనుల్లో వేగం పెంచాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి గ్రామంలో వందమంది కూలీలకు పని కల్పించాలని ఆదేశించారు. నర్సరీల నిర్వహణ, మొక్కల పెంపకం తదితర అంశాల మీద సిబ్బందికి అవగాహన కల్పించారు. విధి నిర్వహణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో ఎంపీవో జావీద్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలు విధి రాత కాదు.. నిర్లక్ష్య ఫలితమే : ఎస్పీ డీవి శ్రీనివాసరావు

మెదక్, ఫిబ్రవరి 26: విధి రాత కాదని, నిర్లక్ష్య ఫలితమేనని జిల్లా ఎస్పీ డి.వి శ్రీనివాస్ రావు వెల్లడించారు. గురువారం నర్సాపూర్ పట్టణ సమీపంలోని బీవీఆర్ ఐటీ కళాశాలలో పోలీస్ ఆధ్వర్యంలో అరైవ్- అలైవ్ అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి రోడ్డు భద్రతకు బ్రాండ్ అంబాసిడర్ కావాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ఎవరి ప్రాణాలు కోల్పోకుండా సురక్షితంగా గమ్యం చేరడమే లక్ష్యంగా నూతన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వెల్లడించారు.


# కర్ల రాజేశ్ తల్లి లలితమ్మకు ప్రభుత్వ ఉద్యోగం

**-నియామక పత్రం అందజేసిన ఆర్డీఓ, ఎస్సీ డిప్యూటీ డైరెక్టర్ దయానందరాణి**



నల్గొండ, ఫిబ్రవరి 26: సీఎంఆర్ఎఫ్ అవినీతి అంశంలో పోలీస్ కస్టడీలో మృతి చెందిన కర్ల రాజేశ్ తల్లి లలితమ్మకు గురువారం ఉద్యోగ నియామక పత్రాన్ని ఆర్డీఓ సూర్యనారాయణ, ఎస్సీ డిప్యూటీ డైరెక్టర్ దయానందరాణి అందజేశారు. పోలీసుల చిత్రహింసలకు గురై కర్ల రాజేశ్ మరణించాడని, అందుకు కారణమైన చిలుకూరు ఎస్ఐ ని సస్పెండ్ చేయాలని కోదాడ పట్టణంలో ధర్మసమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు విశారదన్ మహారాజ్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగతో పాటు పలు దళిత సంఘాలు, బీఆర్ఎస్ పార్టీ ఆందోళన చేసిన విషయం తెలిసిందే. దీంతో పాటు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచంద్రుడు గతవారం రోజుల క్రితం రాజేశ్ కుటుంబాన్ని పరామర్శించి తక్షణమే కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖలో లలితమ్మకు ఉద్యోగ అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు నరేశ్ మాదిగ, బచ్చలకూరి వెంకటేశ్వర్లు, ఏపూరి రాజు, కొండపల్లి ఆంజనేయులు, రాము, కోటేశ్, నాగరాజు, ప్రసాద్, శ్రీను, వెంకట్రావు, నవీన్ పాల్గొన్నారు.

# శ్రీనివాసరెడ్డి కుటుంబానికి గండ్ర దంపతుల పరామర్శ



చిట్యాల, ఫిబ్రవరి 26: మండలంలోని, నవాబ్‌పేట గ్రామ గ్రామానికి చెందిన, పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, భార్య కసిరెడ్డి రమ అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. దీంతో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, వరంగల్ జిల్లా జడ్పీ మాజీ ఛైర్పర్సన్ , భూపాలపల్లి జిల్లా బి ఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి నవాబ్‌పేట గ్రామానికి చేరుకుని మృతురాలి పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి,తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సంఘటనతో గండ్ర జ్యోతి కన్నీటిపర్యంతమయ్యారు. ఈ కార్యక్రమంలో చిట్యాల బిఆర్ఎస్ పార్టీ నాయకులు అల్లం రవీందర్, గొర్రె సాగర్ కుంభం క్రాంతి కుమార్ రెడ్డి, పిట్ట సురేష్, తవటం నవీన్, జంబుల తిరుపతి, పాండ్రాల వీరస్వామి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాలు ఐక్యతకు కేంద్రబిందువులు

**-శతాబ్దాల చరిత్రకు ప్రతీక వాసవి అమ్మవారి ఆలయం**
**-దేవాలయాల పునర్ నిర్మాణం మన సంస్కృతి..**
**-సనాతన ధర్మ పరిరక్షణకు బలాన్నిస్తుంది.**
**-అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ**

నిజామాబాద్, ఫిబ్రవరి 26:ఆలయాలు సమాజ ఐక్యతకు కేంద్రబిందువులని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. వాసవి అమ్మ వారి ఆలయం శతాబ్దాల చరిత్రకు ప్రతీక అని ఇలాంటి



పురాతన దేవాలయాల పునర్నిర్మాణం మన సంస్కృతి, సనాతన ధర్మ పరిరక్షణకు బలాన్నిస్తుందన్నారు. సికింద్రాబాద్ జనరల్ బజార్ ప్రాంతంలో సుమారు 400 సంవత్స రాల చరిత్ర కలిగిన వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ పునఃనిర్మాణ, విగ్రహ పునఃప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ కుటుంబ సమేతంగా ముఖ్యాతిథులుగా హాజరయ్యారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అమ్మవారి విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్టించారు. పునఃనిర్మాణం అనంతరం ఆలయం మరింత వైభవంగా, శోభా యమానంగా దర్శనమిస్తోంది. భక్తుల సమక్షంలో జరిగిన ఈ మహోత్సవం ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పింది.

అమ్మవారి కృపాకటాక్షాలతో రాష్ట్ర ప్రజలందరికీ శాంతి, సౌఖ్యం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# సనాతన సాంప్రదాయాల సిరి ధర్మపురి

## ధర్మపురి క్షేత్రంలో ఫిబ్రవరి 27నుండి మార్చి 11వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు



కోరిన కోర్కెలు తీర్చే ధర్మపురి లక్ష్మీ సమేత నారసింహ (యోగ, ఉగ్ర), శ్రీ వేంకటేశ్వర బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 27నుండి మార్చి 11వరకు సాంప్రదాయ రీతిలో జరుగనున్నాయి. సర్వ దేవతా మూర్తులను కలిగి 'ధర్మపురిని దర్శిస్తే యమపురి ఉండదు' అని విఖ్యాతి నందిన ప్రాచీన చరిత్ర, పౌరాణిక ప్రాధాన్యత కలిగిన ధర్మపురి క్షేత్రంలో ఏటా ఫాల్గుణ శుక్ల ఏకాదశి నుండి 13రోజులు వరుసగా స్థానిక దైవాల వార్షిక ఉత్సవాలు సాంప్రదాయ రీతిలో నిర్వహించడం అనాదిగా ఆచరణలో ఉంది.

"భూషణ వికాస శ్రీ ధర్మపుర నివాస,

దుష్ట సంహార నరసింహ దురితదూర" అనే మకుటంతో భక్తాగ్రేసరుడు శేషప్ప (కాకుస్తం శేషా చలదాసు) రచించిన నరసింహ శతకంలోని పద్యాల మాధుర్యాన్ని ఆస్వాదించని తెలుగు వారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. భారతీయ ప్రాచీన ఆర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు పట్టు కొమ్మగా, హైందవ సనాతన సంప్రదాయాలకు కేంద్ర బిందువుగా, పవిత్ర గోదావరి నదీ తీరాన వెలసి ఆస్తిక ప్రపంచానికి వరదాయిగా, భక్తి ముక్తి ప్రదాయినిగా విరాజిల్లుతున్నది... సుప్రసిద్ధ ప్రాచీన ధర్మపురి పుణ్యతీర్థం. అవిభక్త కరీంనగర్ జిల్లా కేంద్రానికి క 71 కిలోమీటర్ల ఉత్తరాన, ప్రస్తుత జగిత్యాల జిల్లా కేంద్రానికి 27 కిలోమీటర్ల ఈశాన్యన, తెలంగాణలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా, దక్షిణ కాశీగా, నవనారసింహ క్షేత్రాలలో ఉత్కృష్టమైనదిగా, పౌరాణిక, ఐతిహాసిక, చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకున్నది క్షేత్ర రాజం. ప్రధానంగా శివకేశవుల నిలయమై, అపురూపమైన బ్రహ్మ, యమ ధర్మరాజు దైవాలతో త్రైమూర్త్య క్షేత్రంగా, శ్రీలక్ష్మీనర సింహ, రామలింగేశ్వర ఆలయాలు, మసీదు అనాదిగా పక్కపక్కనే కలిగి, పలు క్రైస్తవ ప్రార్థనా మందిరాలతో... వైష్ణవ, శైవ ముస్లిం, క్రైస్తవ మత సామరస్యానికి ప్రతీకగా నిలిచి ఉన్నదీ గోదావరీ తీరస్త పుణ్యతీర్థం. బ్రహ్మాండ, స్కంధ పురాణాలలో, మడికి సింగన పద్మ పురాణంలో, చెరికొండ ధర్మన్న చిత్ర భారతంలో, కొరవి గోపరాజు సింహాసన ద్వాత్రింశికలో, ఏకామ్రనాథుని ప్రతాపరుద్ర చరిత్రలో, నృసింహదాసు మైరావణ చరిత్రలో, పోతనా మాత్యుని నారాయణ శతకంలో, పింగళి సూరనా ర్యుని కళాపూర్ణోదయంలో, శేషాచలదాసు... నరహరి, నృసింహ, నృకేసరి శతకాలలో, కాకతీయా నంతర శాసనాలలో, మధ్యయుగ దాన పత్రాలలో ధర్మపురి క్షేత్ర ప్రాశస్త్యం ప్రశంసించ బడింది.

పూర్వం ధర్మవర్మ మహారాజు ధర్మదేవత భక్తుడై, ప్రజలను ధర్మ కార్యోన్ముఖులను చేయడానికి చేసిన తపస్సు ఫలితంగా "ధర్మపురి" నామాంకితమై, నృసిం హుడు భక్తుల కోర్కెల తీర్చేందుకై ఇచ్చట వెలసి యున్నాడని, పురాణాలు స్పష్ట పరుస్తు న్నాయి. గౌతమ మహర్షి, తన బ్రహ్మహత్య పాతకాన్ని పోగొట్టు కునేందుకు పరమశివుని గూర్చి తపస్సు చేసి, ఆయన జటాజూటం నందు గల "గంగా దేవి"ని ధర్మపురికి రప్పించినందున "గౌతమి" "గోదావరి" అని నదీ పేర్లు వచ్చినట్లు స్థల పురాణం విశదపరుస్తున్నది. శ్రీరామచంద్ర స్థాపిత రామేశ్వరాలయం, అక్కపెల్లి రాజేశ్వరాలయం, శ్రీరామాలయం, దత్తాత్రేయ, గౌతమేశ్వర, శ్రీసాయి శివ బాలాజీ, అయ్యప్ప, ప్రసన్నాంజనేయ, భక్తాంజనేయ, యమ ధర్మరాజు, సంతోషిమాత, సత్యవతీ, మహాలక్ష్మి మందిరాలు ప్రత్యేకతను కలిగి ఉన్నాయి. రామాయణ, భారత, భాగవతాది పురాణ ఘట్టాలు చెక్కబడిన నృసింహాల యపు కాకతీయుల శిల్పకళకు అద్దం పట్టే కళ్యాణ మంటపం, శివాలయం లోని గణేష చండిక, సప్తమాతృకలు, నల్లశనపు రాతిపై సమంశ పద్ధతిలో చెక్కబడిన శ్రీరామలక్ష్మణ, సీతాదేవిల విగ్రహాలు మిగుల మనోజ్ఞమై ఉన్నాయి. ధర్మపురి క్షేత్రం మొదట జైన, బౌద్ధ యుగము లందు ఆర్ష విద్య ప్రచార కేంద్రమై, విధర్భ రాజ్య పోషణలో మున్యాశ్రమంగా ఉండేది. తర్వాత శాతవాహన, బాదామి చాళుక్య, రాష్ట్రకూట, కళ్యాణి చాళుక్య, కాకతీయ, రేచర్ల వెలమల మరియ నిజాం రాజుల ఏలుబడిలో అద్వితీయ వైభవాన్ని అనుభవించింది. ప్రతాప రుద్రుని కాలంలో ఢిల్లీని ఏలిన అల్లావుద్దీన్ ఖిల్జీ సేనాని మాలిక్ నాయబ్ కాఫూర్ సైన్యం క్రీస్తు శకం 1309లో ఇందూరు (నిజామాబాద్) మీదుగా కాకతీయులపై దండెత్తిన సమయంలో ఇచ్చటి నరసింహ ఆలయం, రామేశ్వరాలయాలను ధ్వంసం చేసినట్లు చరిత్ర చెబుతున్నది. 14వ శతాబ్ది మూడవ పాదంలో నారాయణాశ్రమ స్వామి అనే సన్యాసి, నాటి రామగిరి పాలకుడైన ముప్ప భూపతి సేనాని కేశనమంత్రి సాయంతో నారాయణ పురమను మఠంను స్థాపించి, భామ్మణులకు గృహములను నిర్మింపజేసి, అన్న సత్రాన్ని నెలకొల్పారు. 1724-50 మధ్య ధర్మపురి వాసులు తిరిగి నృసింహాలయాన్ని నిర్మించారు.

### క్షేత్ర ప్రాశస్త్యం

అద్వితీయ మహిమాన్వియైన ధర్మపురి క్షేత్రమున యాత్రికుల సౌకర్యార్థం నివాస స్థానములను కట్టించు వారు భగవత్కటాక్షమున ఉత్తమ భవనముల పొందగలరని, ఇచ్చటి జీర్ణమందిర ములను ఉద్ధరించు వారు వైకుంఠమునందు ఉత్తమ సుఖములను అనుభవించ గలరని, శ్రీనృసింహుని పూజ కొరకు పూల చెట్లను పెంచు వారు నందనాది వనములతో సౌఖ్యములను అనుభవించగ లరని, శ్రీనృసింహు శౌల్యన్నమును, దద్యన్నమును మరియు పులిహోరను నైవేద్యమిడు వారు అన్నదాతలై భగవత్కటాక్షమునకు పాత్రులగుదురని, నృసింహుని ప్రీతికై క్షేత్రమున బ్రహ్మణులకు భూదానం, గోదానం మరియు హిరణ్యాది దానముల నొసంగువారు ముందు జన్మమున సార్వభౌము లగుదురని, క్షేత్రమున దీనాదులకు, దంపతులకు, బ్రహ్మచారులకు పశు పక్ష్యాదులకు అన్నదాన మొనర్చినచో, నృసింహ కటాక్షమున వారి వారి పితృ దేవతలు మోక్షమును పొంద గలరని, శౌనకాది మహర్షులకు నైమిషారణ్యము నందు సూత పౌరాణికులు వివరించినట్లు స్కంధ పురాణాంతర్గత ధర్మపురి క్షేత్ర మహాత్మ్యం విశద పరుస్తున్నది.

### నరసింహ అవతార ప్రత్యేకత

రామకృష్ణాది అవతారములవలె గాక , నిర్యాణం లేని శాశ్వత అవతారమైన శ్రీనరసింహుని జయంతి, హిందూ పండగలలో అత్యంత ఆధ్యా త్మిక ప్రాధాన్యత నొందింది. వైశాఖ శుద్ధ చతుర్దశి పుణ్య తిథియందు ఉద్భవించిన నారసింహుని పూజలతో, అకాల మృత్యుభయ ముండదని, దుష్ట గ్రహ బాధలు, పైశాచిక చేతబడుల ప్రయోగాలను తిప్పికొట్టే శక్తి నారసింహ మంత్రానికి గల దని భక్తుల, సాంప్రదాయాచరణాసక్తుల ప్రగాఢ విశ్వాసం.

"ఉగ్రం వీరం మహావిష్ణుం జ్వలంతం సర్వతో ముఖం: నృసింహం భీషణం భద్రం మృత్యుమృత్యుం నమామ్యహం" అనే మంత్రంతో నరసింహ స్వామిని పూజిస్తే శతృ జయం కలుగుతుంది.

పగలు రాత్రి కాని సంధ్యా సమయాన, నరుడు జంతువు కాని రూపంతో, భూమ్యాకాశాలు కాని తొడలపై, సజీవము నిర్జీవ మూ కాని చేతిగోళ్ళతో, హిరణ్య కశిపుని చీల్చి భక్త జన రక్షకుడై, సుదర్శన, శంఖ, చక్ర, ఖడ్గ, ఆంకుశ, పాశు, పరశు , ముసల, కులిశ, పద్మాదులను కలిగి గదాధరుడై ప్రకాశించిన ఉగ్రనారసింహ అవతార తత్వం మిగతా అమారాలకు భిన్నం..

### 13రోజుల బ్రహ్మోత్సవాలు

ఈ సంవత్సరం ఫిబ్రవరి 27వతేదీ నుండి మార్చి 11వరకు, ప్రధానంగా ఫిబ్రవరి 28 వ తేదీ గోధూళి సుముహూర్తంలో స్వామి వారల కల్యాణోత్సవం, మార్చి 3,4,5, తేదీలలో వరుసగా... బ్రహ్మ పుష్కరిణీ (కోనేరు)లో సాయంత్రం శ్రీ యోగానంద నరసింహ, శ్రీ ఉగ్ర నరసింహ, శ్రీ వేంకటేశ్వర స్వామి వారల తెప్పోత్సవం, డోలోత్సవం; 8న సాయంత్రం రథోత్సవం, 9,10,11 తేదీలలో ముప్వరు స్వామి వారల ఏకాంతోత్సవాలు ఘనంగా, సంప్రదాయ రీతిలో జరుగ నున్నాయి.

నిత్య ఆరాధనలతో పాటు ప్రత్యేక, పూజాదికాలు నిర్వహించ నున్నారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశానుసారం, జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్

అధ్యక్షతన, దేవస్థానం ఏసీ, ఈఓ శ్రీనివాస్, జక్కు రవీందర్ నేతృత్వం లోని ధర్మ కర్తల మార్గదర్శకత్వంలో,ఆస్థాన వేద పండితులు బొజ్జా రమేశ శర్మ, వివిధ ఆలయాల అర్చకులు, సిబ్బంది, కార్యక్రమాల ఏర్పాట్ల నిర్వహణలలో నిమగ్నమై ఉన్నారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494

# కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట బిఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా




కరీంనగర్, ఫిబ్రవరి 26: (నేటినిజం ప్రతినిధి) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగాభారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా అధ్యక్షులు పసుల శ్రవణ్ ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్ ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు.కార్మిక చట్టాల అమలులో నిర్లక్ష్యం,కనీస వేతనాల పెంపు లేకపోవడం,కార్మికుల సామాజిక భద్రతా హక్కుల పరిరక్షణలో లోపాలు వంటి అంశాలపై ఈ నిరసన ప్రదర్శన, ధర్నా కార్యక్రమం జరిగింది..ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పసుల శ్రవణ్ ,తొర్తి శ్రీనివాస్ మాట్లాడుతూబీడీ కార్మికుల హక్కులు కాపాడాలని,బీడీ కార్మికుల వేతనాలు పెంచాలని, అన్ని రంగాల్లో కార్మిక చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని, ఆశ,అంగన్వాడీ కార్యకర్తల ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వేతనాల పెంపు భద్రతా పథకాలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు.కార్మికులే దేశ ఆర్థిక వ్యవస్థకు మూలం.కానీ ప్రభుత్వాలు పట్టించుకున్న పరిస్థితుల్లో లేవు, ఈపీఎస్ 95 పెన్షనర్లకు రూ 7500 లకు పెంచాలి, ఈ ఎఫ్ పి ఓ కనీస వేతన పరిమితిని పెంచాలని, కరీంనగర్లో ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని డిమాండ్. చేశారు,ఈ కార్యక్రమంలో బీడీ కార్మికులు,రైస్ మిల్ కార్మికుల ౹,స్ట్రీట్ వెండర్స్, బి ఎం ఎస్ కార్యకర్తలు,బీడీ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి రేణికుంట శంకర్,నక్క అరుణ్,ఆకుల తిరుపతి,మధుకర్, రాజేశం,సుమతి, స్వప్న, అనసూర్య,లక్ష్మి,అనిత పాల్గొన్నారు.

# హుజురాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం గళం విప్పండి...

## -డంపు యార్డ్ ప్రతిపాదనను విరమించుకోవాలి..
## -బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ..



కరీంనగర్, ఫిబ్రవరి 26: (నేటినిజం ప్రతినిధి) హుజురాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి , సమస్యల పరిష్కారం కోసం గళం విప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి బీజేపీ కౌన్సిలర్లకు సూచించారు. హుజురాబాద్ మున్సిపాలిటీ కి ఎన్నికైన నూతన కౌన్సిలర్ల ప్రమాణస్వీకారం గురువారం రోజున జరిగింది. ఈ ప్రమాణ స్వీకరణ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పాల్గొని మాట్లాడారు. హుజురాబాద్ పట్టణ అభివృద్ధి కోసం బిజెపి కౌన్సిలర్లు తమ వంతు కృషి చేయాలన్నారు. మున్సిపాలిటీ అధికార పగ్గాలు కాంగ్రెస్ కు పట్టణ అభివృద్ధి పట్ల తగిన చిత్తశుద్ధి లేదన్నారు. అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్ల అయినా హుజురాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కాంగ్రెస్ చేసిందేమీ లేదన్నారు. ప్రతిపక్ష స్థానంలో బిజెపి కౌన్సిలర్లే ప్రజలకు బాటగా నిలిచి , వారి సమస్యల పరిష్కారం , పట్టణాభివృద్ధి కోసం నిరంతర కృషి చేయాలన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం హుజురాబాద్ మున్సిపాలిటీ శివారులో సిరసపల్లి గ్రామం డంపు యార్డు ఏర్పాటు ప్రతిపాదన ను విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మూడు ఉమ్మడి జిల్లా పరిధిలోనీ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు సంబంధించిన మొత్తం చెత్తను ఇక్కడి ప్రాంతానికి తరలిస్తే హుజురాబాద్ భవిష్యత్తుకే ప్రమాదం తలెత్తే అవకాశం ఉందన్నారు. నేషనల్ హైవే కు, హుజురాబాద్ మున్సిపాలిటీ శివారులో,సిరసపల్లి గ్రామం వద్ద దంపు యార్డ్ ఏర్పాటు చేయడం సరికాదన్నారు. ప్రజల ను , హుజురాబాద్ భవితవ్యాన్ని దృష్టిలో ఉంచుకొని డంపు యార్డ్ ఏర్పాటును విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విరమించుకోకపోతే ప్రజా పోరాటం తప్పదని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి హుజరాబాద్ పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు, కౌన్సిలర్లు కోలుగురి సుమలత సుమన్, దావెర అనూష, అనురాగ్ పంజాల మనోజ్ ,తూర్పాటి లక్ష్మి, దుర్గ రాజు, కొండ ప్రశాంతి మురళి జిల్లా కార్యవర్గ సభ్యులు గంగిశెట్టి ప్రభాకర్ ,జిల్లా కౌన్సిల్ మెంబర్ రావుల వేణు ,బిజెపి మాజీ కౌన్సిలర్లు పైళ్ల వెంకటరెడ్డి, నల్ల సుమన్ ,బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# షెగావ్‌లో జాతీయ ఆరోగ్య ఉత్సవం-2026ను ప్రారంభించిన భారత రాష్ట్రపతి

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 26:మహారాష్ట్రలో బుల్ధానాలోని షెగావ్‌లో ఇవాళ (25 ఫిబ్రవరి 2026) జాతీయ ఆరోగ్య ఉత్సవం-2026ను భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. ఆయుష్ ఆరోగ్య సంరక్షణ రంగంలో విశేష కృషి చేసిన ఆరుగురు సీనియర్ వైద్యులను ఆమె సన్మానించారు.

ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ.. మన సంప్రదాయంలో ఆరోగ్యమే మహాభాగ్యమని అన్నారు. దేశాన్ని శక్తిమంతగా మార్చటంలో ఆరోగ్యవంతమైన పౌరులు కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఆయుష్ వైద్య విధానాలు ఎన్నో సేవలందించాయని, ఆధునిక వైద్యం అందుబాటులో లేనప్పటి నుంచే యోగ, ఆయుర్వేదం, సిద్ధ వంటి పద్ధతులు ప్రజలకు సేవలందిస్తున్నాయని కొనియాడారు.

మన పొలాలు, వంటిళ్లు, అడవుల్లో ఔషధ మొక్కలు, ఆరోగ్యాన్ని కాపాడే వనమూలికల వంటి విలువైన నిధులున్నాయని రాష్ట్రపతి అన్నారు. ఔషధాల తయారీకి అవసరమైన ముడి పదార్థాలను అందించటానికి, పర్యావరణ సమతుల్యతను కాపాడటానికి ఈ విలువైన సంపదను పరిరక్షించటం, అభివృద్ధి చేయటం కీలకమన్నారు. ఔషధ మొక్కలను పెంచటం వల్ల రైతుల ఆర్థికస్థితి మెరుగు పడటమే కాక, నేల సారాన్ని, సంరక్షణను కూడా పెంపొందించవచ్చని తెలిపారు. ఆయుష్ విధానాలను ప్రోత్సహించటం వల్ల ప్రజలు శారీరకంగా, ఆర్థికంగా మెరుగుపడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు మేలు జరుగుతుందని వ్యాఖ్యానించారు.

ఆరోగ్యకరమైన, సమతుల్యమైన జీవనశైలికి ఆయుర్వేదం, యోగా, ఇతర ఆయుష్ విధానాలు మార్గనిర్దేశం చేస్తాయని రాష్ట్రపతి అన్నారు. వ్యాధి నివారణలో సమగ్ర వైద్యం ప్రాముఖ్యతను నేడు ప్రపంచం గుర్తిస్తోందన్నారు. ఒత్తిడిని దూరం చేసుకుని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా ప్రజలు యోగా సాధన చేస్తున్నారని.. ఆయుర్వేద చికిత్సలు, ఔషధాలతో ప్రయోజనం పొందుతున్నట్లు వెల్లడించారు.

ఆధారాలతో కూడిన పరిశోధన, ఔషధాల ప్రామాణీకరణ, నాణ్యత నియంత్రణ వంటివి ఆయుష్ వ్యవస్థల గుర్తింపును, ఆచరణను ప్రోత్సహిస్తాయని రాష్ట్రపతి తెలిపారు. ఈ దిశగా ఆయుష్ మంత్రిత్వ శాఖ చేస్తున్న కృషి పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. ప్రపంచస్థాయి ప్రమాణాలకు అనుగుణంగా.. పరిశోధన, ఔషధాల అభివృద్ధికి సంబంధించిన సాధారణ మార్గదర్శకాలను రూపొందించినట్లు చెప్పారు. ఆధునిక ఆరోగ్య సవాళ్ల పరిష్కారానికి ఆయుర్వేద, యోగా, ఆయుష్ వ్యవస్థలను నెలకొల్పేందుకు ఎన్నో శాస్త్రీయ ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఆధునిక శాస్త్రీయ పరిష్కారాలు, ఆవిష్కరణలు, అంతర్జాతీయ సహకారం ద్వారా సంప్రదాయ వైద్య పద్ధతులకు మరింత ప్రాచుర్యం కల్పించటం ద్వారా వాటిని సమగ్ర ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో అంతర్భాగంగా చేసి, విజయం సాధించవచ్చని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.

# ధన్బాద్ గ్రామ సమస్యలపై జీఎం శాలెం రాజుకు వినతి

రుద్రంపూర్, ఫిబ్రవరి 26 : సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ప్రభావిత ప్రాంతమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం ధన్బాద్ గ్రామ పంచాయతీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సిందిగా కోరుతూ కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలెం రాజుకు ధన్బాద్ ఉప సర్పంచ్ ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలు కీలక సమస్యలను జీఎం దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీ పరిధిలో సులబ్ కాంప్లెక్స్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వీలైనంత త్వరగా సులబ్ కాంప్లెక్స్‌ను పునర్నిర్మించాలని కోరారు. అలాగే సింగరేణి నుండి వచ్చే కాలువలను నిరంతరం శుభ్రపరచాలన్నారు.

# కోతి రాంపూర్ అంగన్వాడీ కేంద్రాల చైర్ పర్సన్ లుగా కార్పొరేటర్ మాసం గణేష్, పడిశెట్టి వసంతలక్ష్మి భూమయ్య...



కరీంనగర్, ఫిబ్రవరి 26: (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ నగర పాలక సంస్థ కోతి రాంపూర్ పరిధిలోగల అంగన్వాడి కేంద్రాల చైర్ పర్సన్ లుగా కార్పొరేటర్ మాసం గణేష్, పడిశెట్టి వసంతలక్ష్మి భూమయ్యలను ఎన్నుకున్నారు. అంగన్వాడీల బలోపేతం , పర్యవేక్షణ కోసం స్థానిక కార్పోరేటర్ల ఆధ్వర్యంలో నూతన కమిటీని గురువారం రోజున ఏర్పాటు చేయడం జరిగింది. 39 డివిజన్ మాసం గణేష్ 9వ డివిజన్ పడిశెట్టి వసంత లక్ష్మి భూమయ్య ఈ కమిటీకి చైర్పర్సన్ గా వ్యవహరించనున్నారు. ఈ కమిటీలో ఏఎన్ఎం గర్భిణీ పిల్లల తల్లులు కిషోర్ బాలికలు సైన్స్ టీచర్ వివో ప్రతినిధి కమిటీ సభ్యులుగా , అంగన్వాడీ కార్యకర్త కన్వీనర్ గా కొనసాగనున్నారు. అంగన్వాడీ కేంద్రంలో ఆరోగ్య లక్ష్మి భోజనం ,ప్రీస్కూల్ పిల్లల ప్రీ స్కూల్ పిల్లల అవసరాల నిమిత్తం వారికి తగిన సహాయం చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. కోతిరాంపూర్ ,పోచమ్మ వాడ అంగన్వాడి అంగన్వాడీ టీచర్లు కే స్వరూప కే శ్యామల పీ సరిత తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ : ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్




నల్గొండ, ఫిబ్రవరి 26:ముందస్తు జాగ్రత్తలు పాటించడంతోనే రోడ్డు ప్రమాదాల నుండి రక్షణ పొందవచ్చు అని ఆత్మకూరు.ఎస్ ఎస్ఐ బి.శ్రీకాంత్ గౌడ్ అన్నారు. అరైవ్ అలైవ్ రోడ్డు భద్రతలో భాగంగా గురువారం మండల వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రోడ్డు నియమాల పట్ల ప్రజలకు సూచనలు చేశారు. అధిక వేగం, మద్యం మత్తులో, తప్పుడు మార్గంలో వాహనాలు నడపవద్దన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించేవారు తప్పక హెల్మెట్ ధరించాలన్నారు. వాహన పరిమితికి మించి ప్రయాణికులను, వస్తువులను రవాణా చేయకూడదని, రహదారులపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపరాదరని ఎస్ఐ పేర్కొన్నారు.

# ఇంటర్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీసు చేస్తూ పట్టుబడ్డ నలుగురు విద్యార్థులు

హైదరాబాద్, ఫిబ్రవరి 26:రాష్ట్రంలో బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షల రెండో రోజు గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఇంటర్‌మీడియట్ బోర్డు సెక్రటరీ తెలిపారు.

మొత్తం 4,63,354 మంది విద్యార్థులకు గాను 4,52,980 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని వివరించారు. 10,374 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. వరంగల్‌లో 3, రంగారెడ్డి జిల్లాలో ఒకరు మాల్ ప్రాక్టీసు కు పాల్పడుతూ అధికారులకు పట్టుబడ్డారని పేర్కొన్నారు. వనపర్తి, వికారాబాద్, భద్రాద్రి, ఆదిలాబాద్, మంచిర్యాల, వరంగల్, సిద్దిపేట, మెదక్, కరీంనగర్, ములుగు, పెద్దపల్లి పరీక్షా కేంద్రాల పర్యవేక్షణకు పరిశీలకులను నియమించినట్లు తెలిపారు.



Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com